ఎడిటోరియల్ డైరెక్టర్: విద్యాసాగర్ కాసోజు, సాగర్ బిజిలి
www.vasthavadarpanam.com
# వాస్తవ దర్పణం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్: మహమ్మద్ జక్రియా
మంగళవారం 28.07.2026
https://epaper.vasthavadarpanam.com

జిల్లాల వారీగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.
WANTED
తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వాస్తవ దర్పణం దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లును ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.
93 91 92 61 19




# హైడ్రా కమిషనర్‌ను మార్చాల్సిందే

- హైకోర్టు సంచలన ఆదేశాలు
- 63 ధిక్కరణ కేసులు.. కోర్టు ఆదేశాల పట్ల నిర్లక్ష్యం
- కమిషనర్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు లేదు
- కోర్టు సహనానికి కూడా హద్దు ఉంటుంది
- రంగనాథ్ కొనసాగితే న్యాయపాలనకే ముప్పు
- జస్టిస్ జుకంటి అనిల్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, జూలై 27:** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను వెంటనే మార్చాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలంగాణ హైకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానాల ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం, కోర్టు అధికారాన్ని బహిరంగంగా ధిక్కరించేలా వ్యవహరించడం వల్ల ఆయన ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని స్పష్టం చేసింది. ఎం/ఎస్ శాంతా శ్రీరామ్ కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన రెండు కోర్టు ధిక్కరణ పిటిషన్లను జస్టిస్ జుకంటి అనిల్ కుమార్ విచారించి ఈ ఆదేశాలు ఇచ్చారు. గత ఒకటిన్నర సంవత్సరాల్లో హైడ్రా కమిషనర్‌పై 63 కోర్టు ధిక్కరణ కేసులు నమోదయ్యాయని, ఇది న్యాయస్థానాల ఆదేశాలను నిరంతరం ధిక్కరించిన తీరుకు నిదర్శనమని కోర్టు పేర్కొంది. కోర్టు సహనానికి కూడా హద్దు ఉంటుందన్నారు. న్యాయస్థానం

మిగతా 2

# రాజ్యాంగ స్ఫూర్తితోనే పని చేస్తున్నా

- చెరువులు, ప్రభుత్వ ఆస్తులు కాపాడుతున్నా
- హైడ్రా రక్షించిన ఆస్తుల విలువ 1.50 లక్షల కోట్లు
- నా కేసులు వేసింది బడా భూ కబ్జా దారులే
- వాటిని నేను చట్ట పరంగానే ఎదుర్కొంటా
- హై కోర్టు ఆదేశాలపై హైడ్రా కమిషనర్‌రంగనాథ్

2





# ‘ఏంజేస్తరో చేయండి... మా పెద్దిని కాపాడండి’

- యశోద వైద్యులకు కేసీఆర్ చేతులెత్తి విజ్ఞప్తి
- సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై ఆరా, కుటుంబానికి భరోసా
- ఖర్చుకు వెనుకాడకుండా అత్యున్నత వైద్యం అందించాలి
- పార్టీ తరపున అన్ని విధాలా సహకరిస్తామని వెల్లడి

వాస్తవదర్పణం స్టేట్ బ్యూరో

**హైదరాబాద్, జూలై 27:** తీవ్ర అస్వస్థతతో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) సోమవారం ఎర్రవెల్లిలోని నివాసం నుంచి ఆస్పత్రికి చేరుకున్నారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన కేసీఆర్, వైద్యులతో దాదాపు 45 నిమిషాల పాటు చికిత్స విధానం, ఆరోగ్య పరిస్థితిపై సమగ్రంగా ఆరా తీశారు. ఉద్యమ సహచరుడిని ఐసీయూలో చూడగానే కేసీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. ‘మీరు ఏం చేస్తారో చేయండి... కానీ మా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడండి’ అంటూ వైద్యులకు చేతులెత్తి నమస్కరించి విజ్ఞప్తి చేశారు. ఖర్చుకు వెనుకాడకుండా అత్యున్నత వైద్యం అందించాలని, పార్టీ తరపున అన్ని విధాలా సహకరిస్తామని స్పష్టం చేశారు. వైద్యులు కేసీఆర్‌కు పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచస్థాయి అత్యాధునిక వైద్యం అందిస్తున్నామని వివరించారు. అవసరమైన మేరకు అమెరికా సహా విదేశీ నిపుణుల సలహాలు తీసుకుంటూ


మిగతా 2

# బీజేపీ యువతకు ఏం సందేశం ఇస్తోంది?

## తప్పు చేసి రాజీనామా చేసిన మంత్రికి పార్లమెంట్లో ఘన స్వాగతమా?

## విద్యార్థుల జీవితాలు నాశనం చేసి సెలబ్రేషన్సా? : టీఆర్ఎస్ చీఫ్ కవిత

వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో




**హైదరాబాద్, జూలై 27:** రాజీనామా చేసిన తర్వాత పార్లమెంట్ కు వచ్చిన ధర్మేంద్ర ప్రధాన్ కు ఘనస్వాగతం పలుకుతూ జిందాబాద్ లు కొట్టటం పై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. దీని ద్వారా బీజేపీ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలని భావిస్తుందని ప్రశ్నిస్తూ ఎక్స్ లో ట్వీట్ చేశారు. ఇప్పటికే కేంద్రంపై తీవ్రమైన అసంతృప్తి, అపనమ్మకంతో ఉన్న ఈ తరం యువతను ఈ సంఘటన మరింత రెచ్చగొట్టేలా ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పశ్చాతాపం, జవాబుదారీ తనంతో కూడింది కాదని ఈ సంఘటన ద్వారా తెలుస్తుందన్నారు. కేవలం ప్రజల్లో ఉన్న ఆగ్రహం నుంచి తప్పించుకోవటానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పేరుతో బీజేపీ నాటకం ఆడిందన్నారు. పార్టీ పట్ల విధేయంగా ఉంటే ప్రభుత్వంలో ఎన్ని తప్పులు చేసిన సరే పట్టించుకోరన్నది స్పష్టంగా తెలుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలను ఆగం చేసిన ధర్మేంద్ర ప్రధాన్, బీజేపీ లు తమ వైఫల్యాలను సైతం ఏదో ఘనకార్యం చేసినట్లు ఊరేగింపులు చేయటం చూస్తుంటే మనం ఎక్కడికి పోతున్నామనే ఆవేదన కలుగుతుందన్నారు.

**కాలు కోల్పోయిన కార్మికుడికి డ్యూటీ ఫిట్ సర్టిఫికెటా?**

రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయి డ్యూటీ చేయలేని స్థితిలో ఉన్న కార్మికుడు మెడికల్ అన్ ఫిట్ కోసం దరఖాస్తు చేసుకుంటే డ్యూటీ ఫిట్ అంటూ సర్టిఫికెట్ ఇస్తారా అంటూ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. కాలు కోల్పోయిన కార్మికుడు ఏ విధంగా విధులు నిర్వహించగలడో సింగరేణి యాజమాన్యం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. మోసం తన నైజం అని కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి నిరూపించుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు నిర్వహించలేని స్థితిలో ఉన్న కార్మికుల వారసులకు ఉద్యోగాలు దక్కకుండా చేసి సింగరేణిని యాజమాన్యం కుట్ర చేస్తోందన్నారు. సింగరేణిని ప్రైవేటుకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే నామమాత్రంగా మెడికల్ బోర్డు నిర్వహిస్తున్నారని ఈ సంఘటనతో తేలిపోయిందని చెప్పారు. మెడికల్ అన్ ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికుడిని అన్ ఫిట్ చేసి వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు.లేదంటే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో మరో పోరాటం తప్పదని హెచ్చరించారు.

# హైడ్రాను రద్దు చేయాలి

## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- సీఎం రేవంత్ రెడ్డికి కోర్టు తీర్పు చెంపపెట్టు
- తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో



**హైదరాబాద్, జూలై 27 :** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను ఆ పోస్టు నుండి తక్షణమే తప్పించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక ఆదేశాలను స్వాగతిస్తున్నామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. ఈ తీర్పు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని విమర్శించారు. అక్రమ నిర్మాణాల పేరుతో సామాన్య ప్రజలను, రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ దౌర్జన్యాలకు వేదికగా మారిన ఈ ‘హైడ్రా’ వ్యవస్థను ప్రభుత్వం తక్షణమే పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అధికారులు చట్టానికి అతీతులు కారని, కోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ ప్రైవేటు భూముల్లోకి చొరబడుతూ ఏకంగా 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలయ్యేలా వ్యవహరించడం 'రూల్ ఆఫ్ లా'ను తీవ్రంగా ఉల్లంఘించడమేనని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరిచి హైకోర్టు ఆదేశాలను అమలు చేయడంతో పాటు, ప్రజావ్యతిరేక సంస్థగా మారిన హైడ్రాను సంపూర్ణంగా రద్దు చేయాలని స్పష్టం చేశారు. చట్టాన్ని పక్కనబెట్టి పాలన సాగిస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని, బాధితుల తరఫున నిలబడి పోరాటం కొనసాగిస్తుందని రాంచందర్ రావు హెచ్చరించారు.



# అవి ఉచితాలు కావు.. ప్రజా పెట్టుబడులు

- అర్ధాకలితో ఏ బిడ్డా బడికి వెళ్లొద్దు
- సానబెట్టిన వజ్రాల్లా మానవ వనరులు
- పాలన అంటే పెత్తనం కాదు.. సమాజ హితవు
- ‘పీపుల్స్ మార్చ్’ నుంచే ప్రజాహిత ఇందిరమ్మ పథకాలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వాస్తవదర్పణం ప్రతినిధి, ఖమ్మం

**జూలై 27:** ఉచిత పథకాలు అనేవి ఈ రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం పెట్టే పెట్టుబడి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టంగా ప్రకటించారు. మిడిమిడి జ్ఞానంతో తెలిసి తెలియక చాలామంది ఉచిత పథకాల పైన విమర్శ చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. పరిశ్రమలు ప్రాజెక్టులు ఇతర అనేక అంశాలపై ప్రభుత్వం పెట్టుబడి పెట్టినట్లుగానే పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు సహా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరి పైన ప్రభుత్వం పెట్టుబడి పెడుతుందని వెల్లడించారు. ఈ పెట్టుబడి ఫలితాలు ప్రజలు అభివృద్ధి చెంది ఆర్థికంగా, సామాజికంగా ముందుకు వెళ్లేందుకు దోహదం చేసేవిగా ఉంటాయన్నారు. సోమవారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన భట్టి.. మధిర నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పోషకాహార అల్పాహారాన్ని అందించే సెంట్రలైజ్

మిగతా 2

# అవి ఉచితాలు కావు.. ప్రజా పెట్టుబడులు

**మొదటిపేజీ తరువాయి**

కమ్యూనిటీ కిచెన్ సెంటర్ ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పుట్టిన ఏ బిడ్డ కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన ఆశయమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పిల్లల శారీరక, మానసిక వికాసం కోసం ఉదయమే రుచికరమైన, శుచిశుభ్రతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రజాప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. బడ్జెట్ లో ప్రకటించిన విధంగానే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత అల్పాహార పథకాన్ని మధిర నియోజకవర్గంలో ప్రారంభించినట్లు చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో ఏ బిడ్డ కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదు.. ఇక్కడ పుట్టిన ప్రతి బిడ్డ.. రాష్ట్ర భవిష్యత్తు అని ఆయన చెప్పారు వారి భవిష్యత్తే మన భవిష్యత్తు. అటువంటి బిడ్డల భవిష్యత్తు కోసం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంతృప్తికరంగా ఉదయం పూట బ్రేక్ ఫాస్ట్ చేసి చదువుకోవాలని అన్నారు. రుచికరమైన, శుచి శుభ్రతతో కూడిన న్యూట్రిషియస్ ఫుడ్ ని మనం అందించాలని చెప్పి ఈ కేబినెట్ చేసిన నిర్ణయం మేరకు బడ్జెట్లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఆయన చెప్పారు. అర్ధాకలితో పాఠశాలకు వచ్చి అధ్యాపకులు చెప్పే పాఠాలను సరిగ్గా వినలేక, ఆకలితో సతమతమవుతూ చదువు మీద దృష్టి పెట్టలేని పరిస్థితి ఏ విద్యార్థికి రాకూడదనే ఆలోచనతో ప్రజా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. మానవ వనరులు మన రాష్ట్ర సంపద. ఏ రాష్ట్ర అభివృద్ధికైనా సహజ వనరులు ఎంత అవసరమో.. సమర్థవంతమైన మానవ వనరులు కూడా అంతే అవసరమని అన్నారు. అత్యంత ప్రతిభావంతులుగా తయారైనటువంటి మానవ వనరులు ఉన్నటువంటి రాష్ట్రం గాని, దేశం గాని ప్రపంచంలో అత్యంత శక్తివంతంగా మారుతుందని ఆయన అన్నారు.

**రాష్ట్రానికే కాదు దేశానికి,**

ప్రపంచానికి కూడా దశా దిశా నిర్దేశం చేయగలిగిన మానవ వనరుల్ని సానబెట్టిన వజ్రాల్లాగా ప్రపంచం మీదికి మనం వదిలిపెట్టగలగాలి. అటువంటి వజ్రాల్ని తయారు చేసుకోవాల్సిన తరుణంలో మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా మొదలుపెట్టే కార్యక్రమానికి నాంది పలికామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకి ఒకటే సమయానికి వేడిగా అల్పాహారం అందించడం అంటే ఇది ఒక చారిత్రాత్మకమైన నిర్ణయమన్న డిప్యూటీ సీఎం.. ఈ దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లెక్కించాల్సిన అంశమని అన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ, ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద ఎత్తున అల్పాహారం అందించే వ్యవస్థ లేదని భట్టి పేర్కొన్నారు. హరే కృష్ణ మిషన్ భాగస్వామ్యంతో పకడ్బందీగా, అత్యంత శుభ్రమైన వాతావరణంలో మెకనైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రాబోయే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా శాశ్వత కిచెన్ నిర్మాణాలను పూర్తి చేసి విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారాన్ని అందించనున్నట్లు భట్టి చెప్పారు. పిల్లలకు అందించే అల్పాహారంతో పాటు పౌష్టికాహారం కోసం వారానికి 3 రోజులు పాలు, మరో 3 రోజులు రాగి జావను ప్రత్యేకంగా అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేసిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలను కళ్లారా చూశానని భట్టి విక్రమార్క చెప్పారు. ఈ సమయంలో బడుల దుస్థితి, నిరుద్యోగుల ఆవేదన, ఇల్లు లేని పేదల బాధలను విన్నానని చెప్పారు. ఆనాడే నా మనసులో రూపుదిద్దుకున్న ఆలోచనలే నేడు ఒక్కొక్కటిగా పథకాలుగా మారుతున్నాయని భావోద్వేగానికి లోనవుతూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ₹22,500 కోట్లతో మొదటి విడతలోనే 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. మహిళలను కోటీశ్వరులను చేసేందుకు బ్యాంక్ లింకేజీ ద్వారా ఇప్పటికే రూ.67వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నారు.



## తెలంగాణ అసెంబ్లీని సందర్శించిన యూపీ అసెంబ్లీ స్పీకర్

**వాస్తవదర్పణం, హైదరాబాద్, జూలై 27:** తెలంగాణ అసెంబ్లీని ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ సతీశ్ మహానా దంపతులు సందర్శించారు. వారికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ స్వాగతం పలికారు. శాసనసభ నిర్వహణపై ఇరువురు స్పీకర్లు చర్చించారు. అనంతరం సతీశ్ మహానా దంపతులను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ వీ నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.





## ఓఎమ్మార్ షీట్ల వ్యవహారంలో ఇద్దరి సస్పెన్షన్

- మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు
- కాంట్రాక్టర్ వర్క్ ఆర్డర్ రద్దు

**వాస్తవదర్పణం, హైదరాబాద్, జూలై 27:** ఓఎమ్మార్ షీట్లు రోడ్డు పక్కన ప్రత్యక్షమైన ఘటన విషయంలో టీజీపీఎస్సీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ఓఎమ్మార్‌షీట్లు రోడ్లపై దర్శనమివ్వడాన్ని సీరియస్‌గా తీసుకున్నది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు సెక్షన్ అధికారులను సస్పెండ్ చేసింది. మరో నలుగురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేసింది. రికార్డుల రవాణా, నిర్వహణలో కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు గుర్తించిన కమిషన్.. సదరు కాంట్రాక్టర్‌కు ఇచ్చిన వర్క్ ఆర్డర్‌ను రద్దుచేసింది. అతనిపై ఎఫ్‌ఐఆర్ నమోదుచేసినట్టు టీజీపీఎస్సీ ప్రకటనలో తెలిపింది. విచారణ కొనసాగుతున్నదని వెల్లడించింది. ఈ ఓఎమ్మార్‌షీట్లు 2018లో నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూవో) నియామక పరీక్షకు సంబంధించినవని.. ప్రస్తుతం జరుగుతున్న నియామకాలపై ఎలాంటి ప్రభావం చూపదని కమిషన్ వెల్లడించింది. 2020లో ఫలితాలు ప్రకటించామని, నిర్వీర్యం నిబంధనల ప్రకారం వాటిని ధ్వంసం చేయాలని నిర్ణయించినట్టు కమిషన్ తెలిపింది. ఈ పనిని ఓ కాంట్రాక్ట్‌కు అప్పగించామని, వాటిని తరలించే క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కొన్ని ఓఎమ్మార్ షీట్లు రోడ్డుపై కనిపించినట్టు పేర్కొన్నది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపింది.

# హైడ్రా కమిషనర్‌ను మార్చాల్సిందే

**మొదటిపేజీ తరువాయి**




పలుమార్లు సహనం ప్రదర్శించినా కమిషనర్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు కనిపించలేదని వ్యాఖ్యానించింది. 'సమర్థ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించే అధికారిపై మరింత సహనం చూపడం అంటే కోర్టు ధిక్కారానికే ప్రోత్సాహం ఇచ్చినట్లే. అది న్యాయపాలనను, న్యాయస్థాన గౌరవాన్ని దెబ్బతీస్తుంది' అని జస్టిస్ అనిల్ కుమార్ వ్యాఖ్యానించారు. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే 'రూల్ ఆఫ్ లా' ప్రమాదంలో పడుతుందని కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

**భూమి వివాదం కాదు..**
**న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ అంశం**

మెద్చల్‌మల్కాజిగిరి జిల్లా లోతుకుంట గ్రామంలోని సర్వే నంబర్లు 1, 2లో ఉన్న 40 ఎకరాల ప్రైవేటు భూమిలో హైడ్రా, ఇతర ప్రభుత్వ శాఖలు, పోలీసులు కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ జోక్యం చేసుకున్నారని శాంతా శ్రీరామ్ కన్స్ట్రక్షన్స్ కోర్టును ఆశ్రయించింది. ఈ సందర్భంగా జస్టిస్ అనిల్ కుమార్, 'ఇది కేవలం భూమి వివాదం కాదు. రాజ్యాంగ న్యాయస్థానాల అధికారాన్ని, గౌరవాన్ని పరిరక్షించాల్సిన అంశం' అని స్పష్టం చేశారు. 'రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు ఎంత కట్టుబడి ఉందో తెలుసుకోవాలంటే కోర్టు తీర్పులను ఎంత వేగంగా, ఎంత నిజాయితీగా అమలు చేస్తుందో చూడాలి. కోర్టు గౌరవం తీర్పుల అమలులోనే ఉంటుంది' అని పేర్కొన్నారు.

**జీవో-99 పరిధిని దాటిన హైడ్రా**

హైడ్రా ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో నెం.99 ప్రకారం ప్రభుత్వ భూములు, రహదారులు, పార్కులు, చెరువుల పరిరక్షణ మాత్రమే సంస్థ బాధ్యత అని కోర్టు గుర్తు చేసింది. అయితే ఇప్పటికే హైకోర్టు తుది తీర్పులు ఇచ్చిన లేదా స్టేటస్‌కో ఉత్తర్వులు అమల్లో ఉన్న ప్రైవేటు భూముల్లో హైడ్రా జోక్యం చేసుకోవడం ద్వారా తన అధికార పరిధిని మించిందని పేర్కొంది. 'ఇన్‌స్పెక్టర్ జనరల్ హోదాలో ఉన్న అధికారి కోర్టు అధికారాన్ని బహిరంగంగా సవాలు చేస్తే న్యాయవ్యవస్థ మౌనంగా ఉండదు' అని జస్టిస్ అనిల్ కుమార్ స్పష్టం చేశారు.

**పిటిషనర్ వాదనకు కోర్టు ప్రాధాన్యం**

వివాదాస్పద భూమిపై యాజమాన్య హక్కు తమ కంపెనీదేనని సింగిల్ జడ్జి తీర్పు ఇవ్వగా, డివిజన్ బెంచ్ కూడా దానిని సమర్థించిందని పిటిషనర్ తరపు న్యాయవాది ఎం. హరీశ్ కుమార్ వాదించారు. ఆ తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేయలేదని, రివ్యూ కూడా కోరలేదని కోర్టు నమోదు చేసింది. అయినప్పటికీ హైడ్రా అధికారులు పదేపదే భూమిలోకి ప్రవేశించి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేయాల్సి వచ్చిందని పేర్కొంది. వివాదాస్పద భూమి కంటోన్మెంట్ పరిధిలోని జీఎల్‌ఆర్ నంబర్243లో ఉన్న 119.34 ఎకరాల బీ2 కేటగిరీ ప్రభుత్వ భూమిలో భాగమని హైడ్రా వాదించింది. రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన సమాచారంతోనే చర్యలు చేపట్టామని తెలిపింది.

బహిరంగ కోర్టులో ఉత్తర్వులను ప్రకటించిన జస్టిస్ జుకంటి అనిల్ కుమార్, పూర్తి తీర్పు ప్రతిని మరో ఒకటి లేదా రెండు రోజుల్లో విడుదల చేస్తామని, ఇంకా కొన్ని పేరాలను జోడించాల్సి ఉందని తెలిపారు. అయితే నేడు ప్రకటించిన ఆదేశాల్లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు.

# రాజ్యాంగ స్ఫూర్తితోనే పని చేస్తున్నా

- చెరువులు, ప్రభుత్వ ఆస్తులు కాపాడుతున్నా
- హైడ్రా రక్షించిన ఆస్తుల విలువ 1.50 లక్షల కోట్లు
- నా కేసులు వేసింది బడా భూ కబ్జా దారులే
- వాటిని నేను చట్ట పరంగానే ఎదుర్కుంటా
- హై కోర్టు ఆదేశాలపై హైడ్రా కమిషనర్‌రంగనాథ్

**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జూలై 27** : ఈ రెండేళ్ల కాలంలో రాజ్యాంగ స్ఫూర్తి ననుసరించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21,48ఏ ప్రకారం ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, పార్కులు రక్షించడం జరిగిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌అన్నారు. తనను తొలగించాలని హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆయన సోమవారం స్పందించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హైడ్రా ఆధ్వర్యంలో రక్షించిన ఆస్తుల విలువ మార్కెట్లో వీటి విలువ రూ. 1.50 లక్షల కోట్లు ఉంటుందని తెలిపారు. ఆరు చెరువులను పూర్తి స్థాయిలో పునరుద్ధరించామని, మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. బడా బాబులు ఆక్రమించిన వందల చెరువులు, పార్కులు, వేల ఎకరాల ప్రభుత్వ భూముల ను హైడ్రా ఈ రెండు సంవత్సరాల లో వెనక్కి తీసుకుని ప్రభుత్వానికి అప్పగించిందని అన్నారు. 'నిజం వైపు నిజాయితీగా నిర్భయంగా, నిబద్ధతతో పని చేస్తాం కాబట్టే హైడ్రా కు ధైర్యం. ల్యాండ్ మాఫియా , భూ కబ్జా దారులు తప్పుడు సమాచారంతో కోర్టులను తప్పు దోవపట్టిస్తున్నారు. లోతుకుంట భూమి విషయంలో దాదాపు పది వేల కోట్ల రూపాయల భూమిని శాంతా శ్రీరామ్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ కొట్టేయాలని చూసింది. పర్మిషన్స్ లేకుండా 2500 కోట్ల సంవత్స రాల హెరిటేజ్ గుట్టలను బ్లాస్టింగ్ చేస్తూ వందల చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా లేకుండా విచ్చల విడిగా విధ్వంసం చేసింది. సేవ్ ద రాక్స్‌సొసైటీ, పర్యావరణ వేత్తలతో పాటు స్థానికులు ఇచ్చిన కంప్లైంట్ మీద హైడ్రా రంగంలో కి దిగింది. ఎక్కడో మూడు కిలో మీటర్ల అవతల ఉండాల్సిన లేని భూమిని చూపిస్తూ, ఈ బిల్డర్ 120 ఎకరాల ప్రభుత్వ భూమిలోకి వచ్చి ఆక్రమించి నా మీద కంటెంప్ట్ కేసు వేయటం జరిగింది. నా మీద 63 కంటెంప్ట్ కేసులు ఉన్నాయి.. వాటిని వేసింది బడా భూ కబ్జా దారులే. వీళ్లు అందరూ వేసిన కేసులే నా మీద ఉన్న 63 కోర్ట్ ధిక్కార కేసులు. వాటిని నేను చట్ట పరంగా నే ఎదుర్కుంటాను. నాకు న్యాయస్థానాలు అంటే పూర్తి నమ్మకం. ప్రభుత్వాలు నాకు గతంలో, ఇప్పుడు, ముమ్ముందు ఏ బాధ్యతలు అప్పగించినా నేను నా వైపు నుండి 100% ఫలితాలు ఇవ్వటానికి పని చేస్తున్నాను, చేస్తాను.' అని అన్నారు.






# 'ఎంజేస్తరో చేయండి... మా పెద్దిని కాపాడండి'

**మొదటిపేజీ తరువాయి**

చికిత్స కొనసాగిస్తున్నామని తెలిపారు. గుండె, ఊపిరితిత్తులు, ఇతర కీలక అవయవాలు సక్రమంగా పనిచేస్తున్నాయని, అయితే మెదడు పూర్తిగా స్పందించే పరిస్థితిపై స్పష్టత రావడానికి మరో 48 గంటలు పట్టే అవకాశం ఉందని వివరించారు. ఎంఆర్‌ఐతో పాటు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, నిపుణుల బృందం నిరంతరం సమీక్షలు చేస్తోందని తెలిపారు. డాక్టర్ల వివరణ విన్న అనంతరం కేసీఆర్ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. 'దేవుడున్నాడు.. డాక్టర్లున్నారు.. అన్నీ సవ్యంగానే జరుగుతాయి. గుండె చెదురొద్దు... ధైర్యంగా ఉండండి' అంటూ భార్య స్వప్న, కుమారుడు నిదర్శన్ రెడ్డి, కుమార్తె ధర్మిష్టతో పాటు కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. దేవుని దయ, వైద్యుల కృషి, ప్రజల ఆశీర్వాదంతో ఆయన కోలుకుంటారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అవసరమైన ఆర్థిక సహాయం కూడా పార్టీ తరఫున అందిస్తామని హామీ ఇచ్చారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, ఎండీ ఏఎస్ రావు, జేఎస్ రావు తదితరులు కేసీఆర్‌కు చికిత్స వివరాలు వెల్లడిస్తూ, తమ శక్తి వంచన లేకుండా వైద్యం అందిస్తున్నామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజయ్య, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మారావు గౌడ్, వినోద్ కుమార్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్ వెంట ఉన్నారు.

## జూరాలకు 27 వేల క్యూసెక్కుల వరద


**వాస్తవదర్పణం, హైదరాబాద్ , జూలై 27 :** జూరాలకు నారాయణపూర్ డ్యామ్ నుంచి కృష్ణమ్మ పరుగులు పెడుతున్నది. సోమవారం 27 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా 1,758 క్యూసెక్కుల వరద దిగువకు వెళ్తున్నది. పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా 317.870 మీటర్లు నిల్వ ఉన్నాయి. కర్ణాటక నుంచి కృష్ణానదికి వరదల నేపథ్యంలో టీజీ జెన్‌కో అప్రమత్తమయ్యింది. ఎగువ జూరాల, దిగువ జూరాలలో విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించింది. ఎగువన 39 మెగావాట్ల సామర్థ్యం గల మూడు ప్లాంట్లు, దిగువన 40 మెగావాట్ల సామర్థ్యం గల మూడు ప్లాంట్లల్లో విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నట్టు, కొద్ది రోజులు విద్యుత్తు ఉత్పత్తి చేపట్టే అవకాశమున్నట్టు సమాచారం



# అనుమతులు లేకున్నా ఆర్‌బీ గ్రామర్ స్కూల్ దర్జా!

- వేల రూపాయల ఫీజులతో తల్లిదండ్రులపై భారం
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం
- బండ్లగూడ మండలం బాబా నగర్‌లో విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ శూన్యం


**వాస్తవదర్పణం, హైదరాబాద్, జూలై 27:** బండ్లగూడ మండలం బాబా నగర్ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఆర్‌బీ గ్రామర్ స్కూల్ అక్రమాలపై స్థానిక తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం 7వ తరగతి వరకే అనుమతులు ఉన్న ఈ పాఠశాలలో 10వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకొని క్లాసులు నిర్వహిస్తుండడం గమనార్హం. సంబంధిత అధికారుల అనుమతులు లేకుండానే పాఠశాలను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో 'వాస్తవదర్పణం' పరిశీలనలో నిజాలు బయటపడ్డాయి. నిబంధనలకు విరుద్ధంగా వేల రూపాయల ఫీజులు వసూలు చేయడమే కాకుండా, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను తప్పనిసరిగా పాఠశాల యాజమాన్యం నుంచే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ అదనపు భారం మోపుతున్నారని తెలిసింది. స్థానికుల కథనం ప్రకారం, ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి విద్యా వ్యాపారమే లక్ష్యంగా పాఠశాలను నడుపుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి విద్యను వ్యాపారంగా మార్చడం ఎంత వరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా, పాఠశాలకు అవసరమైన పూర్తి స్థాయి అనుమతులు లేకపోయినా పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. అసలు పదో తరగతి నిర్వహించేందుకు అనుమతులు ఎక్కడి నుంచి వచ్చాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై విద్యాశాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా విద్యాసంస్థను నిర్వహించడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుండటమే కాకుండా, విద్యార్థుల విద్యా భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, పాఠశాలకు ఉన్న అనుమతులు, గుర్తింపు, పదో తరగతి నిర్వహణకు సంబంధించిన అర్హతలు, ఫీజుల వసూళ్లు, పుస్తకాలు-యూనిఫాంల విక్రయాలపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.


RB Grammar School
Recognised by the Govt. of T.S.
Add. : Near Omer Hotel, Hafiz Baba Nagar, Kanchan Bagh, Hyderabad. T.G.
Cell : 8575999979, 7032464247.
Fee Structure for the Academic year 2026 - 2027
Admission Fees : 5000/- Application Form : 200/-

| CLASSES | 10th June 1st Installment | 10th Sep 2nd Installment | 10th Dec 3rd Installment | Total |
|---|---|---|---|---|
| NUR - U.K.G | 4400 | 4400 | 4400 | 13200 |
| I - V | 4800 | 4800 | 4800 | 14400 |
| VI - VIII | 5200 | 5200 | 5200 | 15600 |
| IX - X | 6000 | 6000 | 6000 | 18000 |

Note : Fee once paid is not refundable or adjustable under any circumstances.

నర్సరీ నుండి 10వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకుంటూ ఫీజులు ఇలా వసూలు చేస్తున్నారు


RB GRAMMAR SCHOOL
Where Learning Begins
7032 46 42 47
# 18-12-418/D/73, Hafiz Baba Nagar, Kanchan Bagh, Hyd. - 500 058 (T.S)
FEE RECEIPT
No. 2272
Date: 10.7.26
Name of the Student:
Father's Name:
Class: 10th Roll No: Section:

| S.No. | DESCRIPTION | AMOUNT |
|---|---|---|
| 1. | Admission Fee | |
| 2. | Books | |
| 3. | Uniform | |
| 4. | I - Installment | 1000 |
| 5. | II - Installment | |
| 6. | III - Installment | |
| 7. | Yearly Fee | |
| 8. | Miscellaneous | |

Total Fee - 16800
Paid - 1000
Due 15800
Amount in Words: One thousand Only
TOTAL 1000

7వ తరగతి వరకే అనుమతులు ఉన్న ఆర్ బీ గ్రామర్ స్కూల్ లో 10వ తరగతికి అడ్మిషన్ ఇస్తూ జారీ చేసిన రశీదు

# ఆ రెండు పార్టీలు సింగరేణిని ముంచాయి

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ లపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్



**వాస్తవదర్పణం నేషనల్ బ్యూరో, హైదరాబాద్, జూలై 27:** తెలంగాణకు ఆత్మ వంటి సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకుని రూ. 54,000 కోట్ల బకాయిల ఊబిలోకి నెట్టేశాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం కేటాయించిన నైని, తాడిచర్ల2, పీకేఓసీ, డిప్ సైడ్ ఎక్స్‌టెన్షన్ బొగ్గు బ్లాకుల ద్వారా సింగరేణికి రూ. 1.95 లక్షల కోట్ల ఆదాయం సమకూరడమే కాకుండా 6,500 మంది యువతకు కొత్తగా ఉద్యోగాలు వస్తాయని స్పష్టం చేశారు. పీకేఓసీ టెండర్లలో తెలంగాణ జెన్‌కో ఉపసంహరించుకుని, ఆ బ్లాక్‌ను సింగరేణికే దక్కేలా చూడాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. సోమవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. మరోవైపు, నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకునే పేపర్ లీకేజీల ముఠాలకు చరమగీతం పాడేందుకే పార్లమెంట్ లో 'పబ్లిక్ పరీక్షల అక్రమాల నిరోధక బిల్లు 2026'ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అయితే కాంగ్రెస్ హయాంలో జరిగిన ప్రశ్నాపత్రాల లీకేజీలపై నైతిక బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల భవిష్యత్తును కాపాడే బిల్లుపై పార్లమెంట్ లో చర్చకు రాకుండా కాంగ్రెస్ పారిపోతోందని విమర్శించారు. అలాగే అధికారంలో ఉన్నప్పుడు ధర్నా చౌక్‌పై నిషేధం విధించిన కేటీఆర్, నేడు అదే స్థలంలో నిరసన తెలపడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

# రేవంత్ సర్కార్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది

- కాంగ్రెస్ వైఫల్యాలపై జెన్-జీ ప్రశ్నిస్తుందనే భయం
- ఎన్నికల వయస్సు కుదించే నిర్ణయం అందులో భాగమే
- సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు



**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జూలై 27 :** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై జెన్‌జీ యువత ప్రశ్నిస్తుందనే భయంతోనే సీఎం రేవంత్ రెడ్డి ఈ కొత్త చర్చను తెరపైకి తెచ్చారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు నిజంగా యువతపై చిత్తశుద్ధి ఉంటే మల్లికార్జున్ ఖర్గేను తప్పించి యువ నాయకుడికి జాతీయ అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదన కేవలం ప్రజలు, విద్యార్థుల దృష్టిని మళ్లించే ప్రయత్నమేనని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ ఇప్పటికే నితిన్ నబిన్‌ను జాతీయ అధ్యక్షుడిగా నియమించి యువతకు ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులకు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదని, 2 లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి, విద్యాభరోసా కార్డులు, ఉచిత స్కూటర్లు, 75% స్థానిక రిజర్వేషన్ల హామీలను కాంగ్రెస్ విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు నిధులు, అధ్యాపకులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని, ఆ బాధ్యతలను కాంగ్రెస్ యువ ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డికి అప్పగించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

# కృష్ణా జలాలపై బీఆర్‌ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు

- కర్ణాటకలో డ్యాంలు కట్టినప్పుడు ఒక్కరోజైనా ప్రశ్నించలేదు
- ఇప్పుడు డ్రామాలు చేయడం ప్రజలను మోసం చేయడమే
- జూరాల పరివాహక రైతులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది
- కర్ణాటకతో సమన్వయం చేసి.. డీపీఆర్‌లు సిద్ధం చేశాం
- సీఎం చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య చర్చలు విజయవంతం
- భీమా, కృష్ణా జలాలను ఒడిసిపట్టి రైతులకు అందించే కార్యాచరణ ప్రారంభమైంది
- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి



**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జూలై 27 :** పాలమూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కర్ణాటకలోని గూడూరు ప్రాంతాన్ని సందర్శించి 'కర్ణాటకలో నీళ్లు - తెలంగాణలో బీళ్లు' అంటూ చేస్తున్న ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయమే తప్ప, పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం కాదని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిందని చెప్పుకునే వారు, బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో కర్ణాటకలో ఆనకట్టలు నిర్మించినప్పుడు ఒక్కసారి కూడా వెళ్లి ప్రశ్నించలేదన్నారు. ఈ మేరకు సోమవారం మీడియాకు ప్రకటన విడుదల చేశారు. జూరాల ప్రాజెక్టు పరిధిలోని రైతుల ప్రయోజనాలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. భీమా, కృష్ణా నదులపై బ్యారేజ్‌కమ్‌బ్రిడ్జిల నిర్మాణం ద్వారా నీటిని నిల్వ చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలనే ఆలోచన కూడా గత ప్రభుత్వానికి రాలేదని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్న ఆయన.. కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ కృష్ణా, భీమా నదులపై బ్యారేజ్‌కమ్‌బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్‌లు సిద్ధం చేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కే. శివకుమార్, కర్ణాటక సాగునీటి శాఖ మంత్రులతో కలిసి హెలికాప్టర్ ద్వారా ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించి, సాంకేతికంగా సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు.

జూరాల ముంపు గ్రామాలైన భూత్పూర్, నేడుగం, అనుగొండ, అంకెనపల్లి, దాదంపల్లి గ్రామాల అభివృద్ధిని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దకాలంగా ముంపు గ్రామాల ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, తగిన నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. ప్రస్తుతం ఆ గ్రామాల అభివృద్ధి, పునరావాసం, భూత్పూర్ డ్యాం విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. పాలమూరు ప్రజల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంటే, ప్లకార్డులు పట్టుకుని రాజకీయ డ్రామాలు చేయడంతో ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రైతులు, యువత అన్ని విషయాలు గమనిస్తున్నారని, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు విరమించుకోవాలని మాజీ ప్రజాప్రతినిధులకు సూచించారు."మంచి చేయలేకపోయినా కనీసం చెడు చేయకండి. ప్రజలను మోసం చేసే రాజకీయాలు మానుకోండి. పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం మా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది" అని మంత్రి స్పష్టం చేశారు.

# టీఆర్‌ఎస్‌లో నియామకాలు

- 9 పార్లమెంట్లు, 19 నియోజకవర్గాలకు ఇంచార్జీలు
- బీసీలకు పెద్దపీట,మహిళా విభాగం అధ్యక్షురాలిగా మనోజ
- విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా జానపాటి రాము యాదవ్
- బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా అల్లంపల్లి రామకోటి




**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జూలై 27 :** తెలంగాణ రక్షణ సేన కీలక రాజకీయాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా పార్టీ కోసం పని చేస్తున్న వారికి పదవీ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు అ పార్టీ చీఫ్ కవిత వెల్లడించారు. అందులో భాగంగా 19 అసెంబ్లీ, 9 లోక్‌సభ నియోజకవర్గాలకు ఇంఛార్జీల నియామకం చేసి వివరలను ప్రకటించారు. ఇప్పటికే మొదటి విడతలో 23 అసెంబ్లీ స్థానాలకు ఇంఛార్జీలను ప్రకటించిన కవిత, తాజాగా రెండో విడత జాబితాలోనూ బీసీ వర్గాలకే పెద్ద పీట వేసినట్లు స్పష్టం చేశారు. పార్లమెంట్, నియోజకవర్గాలతో పాటు పార్టీకి చెందిన పలు అనుబంధ విభాగాలు, జిల్లా కమిటీల బాధ్యలను పలువురికి అప్పగిస్తున్నట్లు అమె స్పష్టం చేశారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా పడాల మనోజ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా జానపాటి రాము యాదవ్, బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా అల్లంపల్లి రామకోటి ని ఎంపిక చేశారు. గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నడిపెల్లి వెంకటేశ్వర రావు, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా కుందూరు దేవేందర్ రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలిగా సుమలత సుధాకర్ శర్మ నియామిస్తున్నట్లు కవిత ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని కమిటీల్లోనూ బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం ప్రత్యేకం. కాగా కవిత పార్టీ ప్రారంభం నుండి బీసీలకు రాజకీయంగా ఎదగాలని వారికి జనాభా ప్రాతిపాధికన రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా తమ పార్టీ నుండి ఆ ప్రక్రియను మొదలు పెట్టాలని తెలుస్తుంది.



# హైడ్రాపై హైకోర్టు తీర్పు రేవంత్ ప్రభుత్వానికి చెంపదెబ్బ

- అధికారంలోకి వస్తే తొలి రోజే హైడ్రాను రద్దు చేస్తాం
- బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్

**వాస్తవదర్పణం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జూలై 27:** హైడ్రా కమిషనర్‌ను వెంటనే తొలగించాలని హైకోర్టు ఇచ్చిన నిర్ణయాన్ని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ స్వాగతించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ పేదల ఇళ్లపై కూల్చివేతలు చేపట్టేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే 99 జీవో ద్వారా హైడ్రాను ఏర్పాటు చేశారని ఆరోపించారు. హైడ్రా కమిషనర్‌పై 63 కోర్టు ధిక్కరణ కేసులు ఉండటం ప్రభుత్వ తీరుకు నిదర్శనమని ఆయన విమర్శించారు. లోతుకుంట, బహదూర్‌గూడ, అమీన్‌పూర్ తదితర ప్రాంతాల్లో హైడ్రా పేరుతో పేదల ఇళ్లపై అన్యాయమైన కూల్చివేతలు జరిగాయని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపదెబ్బ లాంటిదని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి హైడ్రాను అడ్డం పెట్టుకుని రియల్ ఎస్టేట్ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించిన ప్రవీణ్ కుమార్, హైడ్రా వ్యవహారంలో అధికారులు కూడా చట్టాలను, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రంగనాథ్ స్థానంలో మరో అధికారి వచ్చినా ప్రభుత్వ వైఖరి మారకపోతే హైడ్రా తీరు మారదన్నారు. తప్పు చేసిన అధికారులపై బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని, సంబంధిత అన్ని ఫైళ్లను పరిశీలిస్తామని తెలిపారు. తమ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించినట్లుగానే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తొలి రోజే హైడ్రాను రద్దు చేస్తామని ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.



# ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- నాణ్యమైన విత్తనాలను రైతులు వినియోగించుకోవాలి
- వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్

**వాస్తవదర్పణం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జూలై 27:** ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, సూచించారు. ముఖ్యంగా పాడి రైతులు పశుగ్రాస అవసరాల కోసం మేత జొన్న సాగు చేపట్టాలని తెలిపారు. నగరానికి సమీప ప్రాంతాల్లోని రైతులు కూరగాయల సాగు చేపట్టడం ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చని సూచించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని ఫరూఖ్‌నగర్ మండలం వెల్జర్ల గ్రామ రైతు వేదికలో సోమవారం నిర్వహించిన విత్తన మేళాను కె. సురేంద్ర మోహన్ సందర్శించారు. రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి వ్యవసాయ పరిస్థితులు, పంటల సాగు, వర్షాభావ పరిస్థితులపై ఆరా తీశారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని తెలిపారు. రైతు వేదికల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైతు వేదికల్లో కందులు, పెసలు, మినుములు, కూరగాయల విత్తనాలు, మేత జొన్న విత్తనాలు తదితర నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచిందని తెలిపారు. ఈ విత్తన మేళ 29వతేదివరకు రైతులకు అందుబాటులో ఉంటుంది రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ప్రాంత పరిస్థితులకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అనంతరం వెల్జర్ల గ్రామంలోని వ్యవసాయ పొలాలను సందర్శించిన వ్యవసాయ శాఖ కార్యదర్శి, రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి సాగు పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టి లాభదాయక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, స్థానిక అధికారులు రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణకు మరింత సహకారం అందించండి

- తాడిచెర్ల-2 పనుల్లో వేగవంతం చేయాలి
- స్థానికులకు వెయ్యి ఉద్యోగాలు కల్పించాలి
- సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రూ.10 వేల పెన్షన్ అందించాలి
- కేంద్ర మంత్రులకు మంత్రి వివేక్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ వినతిపత్రాలు



**వాస్తవదర్పణం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జూలై 27:** తెలంగాణలో కార్మిక సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపు, కేంద్ర పథకాల అమలులో రాష్ట్రానికి మరింత సహకారం అందించాలని శక్తి (కార్మిక, శిక్షణ, ఉపాధి ఫ్యాక్టరీస్) గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ... కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు విజ్ఞప్తి చేశారు. ఉపాధి అవకాశాల కల్పనతో రాష్ట్రం ఆర్థిక పురోగతి వైపు పయనిస్తోందని చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ తో కలిసి సోమవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. రాష్ట్రంలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, గనుల పురోగతి, మౌలిక వసతుల విస్తరణ, కార్మిక సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించారు. అనంతరం కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరిని కలిసి యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల అభివృద్ధి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాల విస్తరణపై చర్చించారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కలిసి పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి అత్యంత కీలకమైన తాడిచెర్ల2 బొగ్గు గని ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు ఆలస్యం కాకుండా త్వరగా పూర్తి చేసి, స్థానిక యువతకు కనీసం వెయ్యి ఉద్యోగాలు కల్పించాలని, ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల వారికి ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నిర్వాసిత కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద సమగ్ర పునరావాసం, పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కూడా విజ్ఞప్తి చేశారు. అలాగే సింగరేణి సంస్థలో పదవీ విరమణ పొందిన కార్మికులకు కనీస నెలవారీ రూ.10 వేల పెన్షన్ అందేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తక్కువ పెన్షన్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలాది మంది రిటైర్డ్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి విస్తరణ, కొత్త బొగ్గు గనుల అభివృద్ధి, గనుల ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా తాడిచెర్ల2 ప్రాజెక్టు పనుల వేగవంతం, స్థానికులకు ఉద్యోగాల కల్పన, ఆర్‌అండ్‌ఆర్ అమలు, సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ అంశాలను సంబంధిత శాఖలతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు తెలంగాణ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల విస్తరణ, కార్మికుల సంక్షేమం, గనుల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంపై నిరంతరం కృషి చేస్తూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.



## రేషన్ కార్డు ఈకేవైసీకి మరో నాలుగు రోజుల గడువు

**వాస్తవ దర్పణం, హైదరాబాద్, జూలై 27:** రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ (eKYC) పూర్తి చేసేందుకు ప్రభుత్వం మరో నాలుగు రోజుల గడువు పొడిగించింది. గతంలో నిర్ణయించిన జూలై 31 చివరి తేదీ యథావిధిగా కొనసాగుతుండగా, ఇంకా ఈకేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులు గడువు ముగిసే లోపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈకేవైసీ పూర్తి చేయని కార్డుదారులు సమీపంలోని రేషన్ దుకాణాన్ని సందర్శించి బయోమెట్రిక్ విధానంలో ధృవీకరణ పూర్తి చేయవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియను పూర్తి చేయకపోతే భవిష్యత్తులో రేషన్ సరుకుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అందువల్ల రేషన్ కార్డుదారులందరూ చివరి తేదీ కోసం వేచి ఉండకుండా వీలైనంత త్వరగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ విజ్ఞప్తి చేసింది.



## శామీర్ పేట లో అబ్దుల్ కలాం వర్ధంతి: అఫ్జల్ ఖాన్

**వాస్తవ దర్పణం, శామీర్ పేట, జులై 27:** సీనియర్ ఉద్యమ కారులు, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ సోమవారం మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి ని పురస్కరించుకుని శామీర్ పేట్ లో ని ఎస్ ఎమ్ హైస్కూల్ లో విద్యార్థుల మద్య అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు అబ్దుల్ కలాం చెప్పినట్టు విద్యార్థులు కలలు కని వాటిని సాకారం చేసుకోవాలని తెలిపారు. ఉన్నత శిఖరాలను అధిరోహించి భారతావనికి సేవలు అందించిన ఎపిజె అబ్దుల్ కలాం సామాన్య జీవితం గడిపారని అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు అన్నారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్ ఖాన్ తో పాటు నాయకులు, ఉపాధ్యాయులు పి నర్సింహా రెడ్డి, పాటశాల డైరెక్టర్ బత్తిని రాజు గౌడ్, ప్రిన్సిపాల్ దీపిక, వైస్ ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## రామంతాపూర్ మినీ ట్యాంక్ బండ్ వద్ద మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠ

**వాస్తవ దర్పణం, రామంతాపూర్, జూలై 27:** రామంతాపూర్ మినీ ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతంలో మహనీయులైన పండుగ సాయన్న, కొండా లక్ష్మణ్ బాపూజీతో పాటు ఇతర ప్రముఖుల విగ్రహాలను ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ, మహనీయుల జీవితాలు నేటి యువతకు ఆదర్శప్రాయమని, వారి త్యాగం, ధైర్యం, సేవాభావం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. భావి తరాలకు వారి ఆశయాలు చేరేలా చేయాలనే ఉద్దేశంతోనే విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామంతాపూర్ ప్రాంతంలోని వివిధ కుల సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహనీయుల స్ఫూర్తిని చిరస్థాయిగా నిలిపే కార్యక్రమాన్ని చేపట్టిన ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌ను పలువురు అభినందించారు.



## రామంతాపూర్ నల్లపోచమ్మ తల్లి ఘటం ఊరేగింపులో ఆకారపు అరుణ్ పటేల్

**వాస్తవ దర్పణం, ఉప్పల్, జూలై 27:** ఆషాఢ మాస బోనాల జాతర మహోత్సవాల సందర్భంగా రామంతాపూర్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో టీవీ స్టూడియో సమీపంలోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయం నుంచి వైభవంగా నిర్వహించిన ఘటం ఊరేగింపులో ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, రామంతాపూర్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఘటం ఊరేగింపులో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయ కళారూపాలు, మంగళవాయిద్యాల నడుమ ఘటం ఊరేగింపు భక్తిపారవశ్య వాతావరణంలో కొనసాగింది.

### కొంపల్లి–బహదూర్‌పల్లి రహదారి, మియాపూర్–గండిమైసమ్మ చౌరస్తా

# రహదారి అభివృద్ధి పనుల పురోగతి

- పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర ఐటీ & పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు





**వాస్తవ దర్పణం, శామీర్ పేట జులై 27:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొంపల్లి-బహదూర్‌పల్లి రహదారి, మియాపూర్-గండిమైసమ్మ చౌరస్తా రహదారి అభివృద్ధి పనుల పురోగతిని తెలంగాణ రాష్ట్ర ఐటీ & పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిశీలించారు. సోమవారం కుత్బుల్లాపూర్ మండలంలోని కొంపల్లి-బహదూర్‌పల్లి రహదారి, మియాపూర్-గండిమైసమ్మ చౌరస్తా రహదారి అభివృద్ధి పనులను పరిశీలించేందుకు విచ్చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు జిల్లా కలెక్టర్ మను చౌదరి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రహదారి అభివృద్ధి పనులలో భూనిర్వాసితులకు ముందుగా నష్టపరిహారం అందించాలని సైబరాబాదు కమీషనర్ సృజనకు సూచించారు. అటవీ శాఖ అనుమతులు సాధించి, ప్రజల ఎన్నో ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యుత్తుశాఖ వారి పనులలో భాగంగా ఎలక్ట్రిక్ పోల్ షిఫ్టింగ్ ఎంత వరకు అయ్యాయని, మిగిలినవి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు పనుల నిరంతరాయ అమలుకు వీలు కల్పించేందుకు, దూలపల్లి మరియు బహదూర్పల్లి గ్రామాలలో భూసేకరణ ప్రక్రియను ప్రాధాన్యతా క్రమంలో వేగవంతం చేసి పూర్తి చేయాలని కొంపల్లి, దుండిగల్ డిప్యూటీ కమిషనర్ ను ఆదేశించడం జరిగింది. అటవీ ప్రాంతంలో ఉన్న అన్ని విద్యుత్ స్తంభాలను ఆగస్టు 15వ తేదీలోగా తరలించే పనిని, హెచ్ఎండిఏ సహకారంతో ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని టిజిఎస్పిడిసిఎల్ కు సూచించారు. విద్యుత్ స్తంభాల మార్పిడి పూర్తయిన వెంటనే మిగిలిన రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించి, సెప్టెంబర్ నెలాఖరులోగా మొత్తం రోడ్డు పని పూర్తయ్యేలా చూడాలని హెచ్ఎండిఏ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రాజెక్ట్ పరిధిలోని డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడానికి తదుపరి అవసరమైన చర్యలు తీసుకోవడం కోసం, ప్రతిపాదిత తుఫాను నీటి కాలువ యొక్క అలైన్మెంట్తో సహా వివరణాత్మక ప్రతిపాదనను సిద్ధం చేసి, వీలైనంత త్వరగా పరిశీలన నిమిత్తం సి ఎం సి కమీషనర్ కు సమర్పించాలని హెచ్ ఎం డి ఏ ఆదేశాలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకెష్ కుమార్, డిసిలు , ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, హెచ్ఎండిఏ, టిజిఎస్పిడిసిఎల్, అటవీ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## ప్రజావాణిలో జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిష్కరించాలి


- మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**వాస్తవ దర్పణం, శామీర్ పేట, జులై 27:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి అదనపు కలెక్టరు (106) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు డయల్ యువర్ ఆర్టీసీ డిఎం

**వాస్తవ దర్పణం, శామీర్ పేట, జూలై 27**: హకీంపేట ఆర్టీసి డిపో పరిధిలో డయల్ యువర్ డి ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సరితా దేవి సోమవారం తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు ఆర్టీసీ బస్ సర్వీస్ సేవలకు సంబంధించి తమ తమ సమస్యలతో పాటు సూచనలు, సలహాలు, ఉద్యోగుల ప్రవర్తన పై తెలిపేందుకు 28న నేడు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంటల వరకు 9959226144 ఫోన్ నంబర్ లో డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని సద్వినియం చేసుకోవాలని కోరారు. ప్రయాణికులు మీ అమూల్యమైన సూచనలు, సలహాలను అందజేయాలని డి ఎం విజ్ఞప్తి చేశారు.



## చర్లపల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనఖీ

- వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె.ఆనంద్

**వాస్తవ దర్పణం, శామీర్ పెట్, జులై 27:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ గురువారం చర్లపల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడి వైద్య సేవలు, రికార్డుల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డులను పరిశీలించిన డీఎంహెచ్‌వో, నమోదు చేస్తున్న వివరాలు కచ్చితంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య శాఖకు సంబంధించిన అన్ని కార్యక్రమాల పురోగతిని ఎప్పటికప్పుడు పోర్టళ్లలో నమోదు చేసి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. నంతరం వ్యాక్సిన్ల నిల్వ కోసం వినియోగిస్తున్న ఐఎల్ఆర్ రిఫ్రిజిరేటర్‌ను తనిఖీ చేసి, వ్యాక్సిన్లకు అవసరమైన ఉష్ణోగ్రత నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు. వ్యాక్సిన్ల భద్రత విషయంలో ఎలాంటి అలసత్వానికి తావు ఇవ్వొద్దని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా పనిచేయాలని డా. ఆనంద్ సూచించారు. జ్వరాల సర్వేలు ముమ్మరం చేయడంతో పాటు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఎక్కడైనా జ్వర కేసులు గుర్తించిన వెంటనే ఫాలోఅప్ చేసి అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే స్పందించేలా మందులు, అవసరమైన సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలని ఆరోగ్య సిబ్బందికి తెలిపారు. జలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఆరోగ్య కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని డీఎంహెచ్‌వో డా. కె. ఆనంద్ పేర్కొన్నారు.




## యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నివాళులుగా కాగడాల ప్రదర్శన

**వాస్తవ దర్పణం, యాదాద్రి భువనగిరి, జూలై 27:** నీట్ పేపర్ లీక్ వలన మానసిక వేదనతో ఆత్మహత్యలు చేసుకుని ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మంగ ప్రవీణ్ ఆధ్వర్యంలో భువనగిరి జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు కాగడాలు, కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎండి అవేస్ చిస్తి, పిసిసి సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ వల్ల దాదాపు 21 మంది విద్యార్థులు వారి ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది విద్యార్థులు ఆందోళనలో తీవ్రంగా గాయపడ్డారని, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలో విద్వేషాన్ని పెంచి పోషించే పనిలో తప్ప ఇతర ఎవరి బాధలను పట్టించుకునే పరిస్థితిలో లేదని అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వంలో ఇప్పటివరకు 1542 సార్లు వివిధ పరీక్షల పేపరు లీక అయ్యాయని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో చేతులు దులుపుకుంటే చూస్తూ ఊరుకోమని , ఢిల్లీ లాఠీఛార్జ్ విద్యార్థులపై దాడికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, చనిపోయిన విద్యార్థుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగడి నాగరాజు, గుర్రాల శ్రీను, ఎండి. బురాన్, కౌన్సిలర్ పోలిశెట్టి అనిల్ కుమార్, సూదగాని రాజు, ఎండి బబ్లు, ఎండి మజార్, బెండ లాల్ రాజ్, మహేందర్, శంకర్, బింగి నరేష్, మహేష్, సందీప్, చందు, వినయ్, రఫిఉద్దిన్, కొల్లూరి రాజు, సన్నీ, అసద్, మసూద్, రమేష్, శివ, శివ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షా కాల అంటువ్యాధుల నివారణపై అవగాహన

**వాస్తవ దర్పణం, శామీర్ పెట జులై 27:** మున్సిపల్ చైర్మన్ జాము రవి అధ్యక్షతన - మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ ఆధ్వర్యంలో వర్షాకాల అంటువ్యాధుల నివారణపై అవగాహన. మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ ఆధ్వర్యంలో వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నిల్వ నీరు లేకుండా చూసుకోవడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, తాగునీటిని మరిగించి లేదా శుద్ధి చేసి వినియోగించడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జ్వరం, దగ్గు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి ఇంటి నుంచి వచ్చి తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తను విడివిడిగా వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో లేదా కాలువల్లో వేయకుండా పరిశుభ్రతను కాపాడేందుకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీ ఎం సి నర్సింహ శానిటేషన్ ఇన్స్పెక్టర్ మోహన్ సింగ్ మల్లిఖార్జున్ జిల్లా పట్టణ సమైక్య అధ్యక్షురాలు అజయ లక్ష్మి, బిట్స్ పిలాని స్టూడెంట్ దీప్తి ఆదిరాజు మహిళలు పాల్గొన్నారు పరిశుభ్రమైన మూడుచింతలపల్లి - ఆరోగ్యకరమైన మూడుచింతలపల్లి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.









# నందిగామ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ

- **పోలీసు సేవల మెరుగుదల, దర్యాప్తు నాణ్యత పెంపుపై కీలక ఆదేశాలు: ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డా. తరుణ్ జోషి**



**వాస్తవ దర్పణం, నందిగామ, జూలై 27:** ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ సోమవారం నందిగామ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, దర్యాప్తు విధానాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రేవ్ అన్‌డిటెక్టెడ్ (UI) కేసులను సాంకేతిక ఆధారాలతో త్వరగా ఛేదించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనల అమలు, అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. అలాగే సీసీటీఎన్ఎస్ (CCTNS), ఈసాక్షి వంటి సాంకేతిక వ్యవస్థలను సమర్థంగా వినియోగించి దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలని పేర్కొన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలకు తక్షణ స్పందన ఇవ్వాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అనంతరం సీపీ డా. తరుణ్ జోషి కాన్హా శాంతివనంను సందర్శించి అక్కడి నిర్వాహకులతో సంస్థ కార్యకలాపాలపై చర్చించారు. చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి విద్య, విలువలు, మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో శాద్‌నగర్ జోన్ డీసీపీ శిరీష, శాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, నందిగామ ఎస్‌హెచ్ఓ వీరబాబుతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి

**వాస్తవ దర్పణం, బోడుప్పల్, జూలై 27:** మేడ్చల్ నియోజకవర్గంలోని బోడుప్పల్ డివిజన్ టెలిఫోన్ కాలనీలో గల శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం 9వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, భక్తి భావాలను పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్లు బుచ్చిరెడ్డి, వెంకట్ రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కృష్ణ, ఘట్‌కేసర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, రెడ్యానాయక్, సందీప్ రెడ్డి, జగన్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



## యువకుడు అదృశ్యం.. మిస్సింగ్ కేసు నమోదు

**వాస్తవదర్పణం, జవహర్ నగర్, జూలై 27:** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మల్కాజిగిరి ఆనందనగర్‌కు చెందిన ముకిద్ (20) అనే యువకుడు అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గత మూడు సంవత్సరాలుగా దమ్మాయిగూడలోని 3D వీల్స్ షాపులో పనిచేస్తున్న ముకిద్,ఈ నెల 25న ఉదయం పనిలోకి వచ్చిన అనంతరం కనిపించకుండా పోయాడు.షాప్ యజమాని అమరేందర్ రెడ్డి సమాచారం మేరకు యువకుడి స్కూటీ షాప్ వద్ద ఉండగా,అతని మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు.తండ్రి జిలానీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.





## బీరప్పగడ్డలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన పరమేశ్వర్ రెడ్డి

- **అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలని పిలుపు**

**వాస్తవ దర్పణం, ఉప్పల్, జూలై 27:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. బీరప్పగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరానగర్‌లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (Special Intensive Revision-SIR) కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) కలిసి ఓటరు నమోదు, పేరు సవరణలు, చిరునామా మార్పులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను సమీక్షించారు. అనంతరం బీరప్పగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆకిటి ఆగం రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరు వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైతే సంబంధిత దరఖాస్తులను వెంటనే సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఓటర్లకు అవసరమైన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ప్రతి అర్హ పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుకు రావాలని మందుముల పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీరప్పగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆకిటి ఆగం రెడ్డి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బొట్టు రాజేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బజార్ జగన్నాథ్ గౌడ్, సందీప్ భూషణ్, జగదీష్, మధుసూదన్, సుశీల, గీత, ప్రేమలత, ఈశ్వరి, ఫహీమ్, రాము గౌడ్, తూర్పాటి జంగయ్య, శ్రవణ్, సుబ్బారావు, రమేష్ గౌడ్, సోను గౌడ్, శ్రవంతి, శ్రీలత, టైలర్ సీను, టైలర్ బాలు, సాయిలు, గవ్వల సంతోష్, రాములు గౌడ్, దుర్గా, ఎడ్ల అంజయ్య, శరత్, శంకర్, నరేష్, శ్రీకాంత్ రెడ్డి, కాశీ, వంశీ, బబ్లూ, బన్నీతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, బేడా బుడగ జంగాల బస్తి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రాజన్న ఆలయానికి మరో 99.40 కోట్లు!

**వాస్తవదర్పణం బ్యూరో, ఉమ్మడి కరీంనగర్, జూలై 27:** దక్షిణ కాశీగా, ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి, దేవస్థానం అభివృద్ధి, పనులకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.99.40 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తాజా నిధుల మంజూరుతో ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం నిధులు రూ.249.40 కోట్లకు చేరుకున్నాయి.వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోదశల వారీగా భారీ నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా 202324 ఆర్థిక సంవత్సరంలో రూ. 50 కోట్లు, 202425 ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు విడుదల చేయగా... ఇప్పుడు మరో రూ.99.40 కోట్లు మంజూరు చేయడం తో అభివృద్ధి పనుల కు మరింత వేగం చేకూరనుందనే చెప్పాలి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో చేపట్టిన ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఆలయ పరిసరాలను ఆధునికీకరించడం, యాత్రికులకు విశాలమైన వసతులు కల్పించడం వంటి లక్ష్యాలతో ఈ పనులు కొనసాగు తున్నాయి. ఇప్పటికే సుమారు 50% శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు.



## గృహిణి అదృశ్యం

- **భర్త ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు**

**వాస్తవదర్పణం, జవహర్ నగర్, జూలై 27:** జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడ ఇంద్రమ్మ కాలనీ ఫేజ్ 2కు చెందిన స్వాతి (30) అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది.ఈ నెల 26న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో భర్త నరేష్ జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టీల లావాదేవీలు, బంగారం తాకట్టు వ్యవహారాలకు సంబంధించి మనస్తాపానికి గురైన స్వాతి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు భర్త తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.



## సర్ ప్రక్రియ సాఫీగా సాగేలా సహాయ కేంద్రాలు పని చేయాలి

- **కాంగ్రెస్ శ్రేణులకు మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పిలుపు**

**వాస్తవ దర్పణం, ఉప్పల్, జూలై 27:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ సాఫీగా, వేగవంతంగా జరిగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉప్పల్ సత్యనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ సహాయ కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం పనితీరును సమీక్షించి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కార్యకర్తలకు సూచించారు. నిజమైన ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని, బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు మెరుగైన సేవలు అందించాలని ఆమె అన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదయ్యేలా కాంగ్రెస్ శ్రేణులు చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి, తుమ్మల దేవిరెడ్డి, కాటేపల్లి విజయ్ కుమార్, కుశంగళ సతీష్ ముదిరాజ్, ఈగ రాజేష్, పోగుల నర్సింహారెడ్డి, రామోజు సత్యనారాయణ, పోగుల సజీవ రెడ్డి, బొౌ్ర రాజు, సుప్రీత్, వెంకటేష్ సేట్, నోముల సురేష్, బోడిగే మల్లేష్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కుయ్యాల శ్రీనివాస్‌తో పాటు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సమావేశం

**వాస్తవ దర్పణం, హైదరాబాద్, జూలై 27:** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ అధ్యక్షతన, రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి సూర స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో సమాచార హక్కు చట్టం-2005 సమర్థ అమలు, సంస్థ భవిష్యత్ కార్యాచరణ, రాష్ట్రవ్యాప్తంగా సంస్థ విస్తరణ, ప్రజల్లో అవగాహన పెంపు, ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించే అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఏర్పాటు చేసే సలహా, పర్యవేక్షణ, అధ్యయన తదితర కమిటీలలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సభ్యులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ను కోరుతూ సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది. అదేవిధంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయిలో సంస్థను బలోపేతం చేయడం, ప్రజలకు సమాచార హక్కు చట్టంపై ఉచిత అవగాహన కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు, న్యాయ, సాంకేతిక మార్గదర్శక సేవలు అందించడం, ప్రభుత్వ శాఖల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తివంతమైన సాధనమని, ప్రభుత్వం, సమాచార కమిషన్, ప్రజా సంఘాలు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు సమాచారం మరింత వేగంగా, పారదర్శకంగా అందుతుందని అన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి సూర స్రవంతి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి, ప్రతి గ్రామానికి సమాచార హక్కు ఉద్యమాన్ని విస్తరిస్తామని తెలిపారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్, జాతీయ సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చింతల రాఘవేందర్, రాష్ట్ర కోకన్వీనర్ గడప కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్, అరవింద్ స్వామి, రాష్ట్ర కార్యదర్శులు రావుల నవీన్ కుమార్, కేడెల ప్రసాద్, మడుపు వేణుగోపాల్ రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఏ. శ్రీకాంత్ రెడ్డి, శివకుమార్ గౌడ్, అశోక్ కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గుడ్డేటి ప్రవీణ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము అశోక్, నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు మంద సాయిబాబు తదితర జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సమాచార హక్కు చట్టం అమలును మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్, అన్ని ప్రభుత్వ శాఖలు ప్రజా సంఘాలతో సమన్వయం పెంపొందించాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

# దివ్యాంగ బాలుడి కోరికను నెరవేర్చిన సీపీ సుమతి బడుగుల

**వాస్తవ దర్పణం, మల్కాజిగిరి, జూలై 27:** పుట్టుకతోనే దివ్యాంగుడైన రాహుల్‌కు పోలీస్ అధికారి కావాలన్న చిరకాల కోరికను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి బడుగుల, ఐపీఎస్ నెరవేర్చారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయానికి ఆహ్వానించిన సీపీ సుమతి బడుగుల, రాహుల్‌ను తన అధికారిక కుర్చీలో కూర్చోబెట్టి పోలీస్ క్యాప్ ధరింపజేశారు. అనంతరం అతనితో ఆప్యాయంగా మాట్లాడి, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. తన కల నెరవేరడంతో రాహుల్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అతని ముఖంలో కనిపించిన చిరునవ్వు అక్కడున్న వారిని భావోద్వేగానికి గురి చేసింది. ఈ సందర్భంగా విధి నిర్వహణతో పాటు సమాజం పట్ల మానవత్వాన్ని చాటుతూ మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకుందని పలువురు అభినందించారు.








# సోషల్ మీడియాలో మరో వినూత్న నిరసన

- స్వచ్ఛమైన ఇంధనం కోసం 'ఈ20 జనతా పార్టీ'!
- పాత పెట్రోల్ కూడా అమ్మాలంటూ డిమాండ్
- నెటిజన్ల నుంచి విశేష స్పందన

**వాస్తవదర్పణం, నేషనల్ డెస్క్:** గతంలో నీట్ పేపర్ లీక్‌పై వ్యంగ్యంగా స్పందిస్తూ నిరసనలు చేపట్టి దేశవ్యాప్తంగా ట్రెండ్ అయిన 'కాక్రోచ్ జనతా పార్టీ' తరహాలోనే.. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా మరో కొత్త ప్రచారం ఊపందుకుంది. వాహనదారుల ఇంధన సమస్యలపై గళం విప్పుతూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా 'ఈ20 జనతా పార్టీ' పేరుతో ఓ వినూత్న ఉద్యమం ప్రారంభమైంది. సాధారణంగా లభించే 100 శాతం స్వచ్ఛమైన పెట్రోల్‌తో పాటు ఎథనాల్ కలిపిన ఈ20 ఇంధనం రెండూ పెట్రోల్ బంకుల్లో అందుబాటులో ఉండాలని, ఏ ఇంధనం వాడాలో ఎంచుకునే స్వేచ్ఛ వాహనదారులకే వదిలేయాలని ఈ వర్చువల్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. మలేసియా కేంద్రంగా మే 2024లో ప్రారంభమైన ఈ 'ఈ20 జనతా పార్టీ' ఎక్స్ ఖాతా, ఈ ఏడాది జనవరిలో వెరిఫైడ్ హోదాను పొందింది. ఈ ఖాతా యూజర్ నేమ్‌ను ఇప్పటివరకు మూడుసార్లు మార్చడంతో పాటు దీని ఐడెంటిటీని పలుసార్లు అప్‌డేట్ చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తరహాలోనే ప్రజా మద్దతును కూడగట్టేందుకు ఈ ఖాతా వ్యంగ్య ధోరణిలో విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. తమది రాజకీయం కోసం కాకుండా పౌరుల ఆధ్వర్యంలో నడిచే ఒక 'వినియోగదారుల హక్కుల ఉద్యమం' అని ఈ పార్టీ స్పష్టం చేసింది. ఇంధన విధానంలో పారదర్శకత, వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పలు డిమాండ్లను తెరపైకి తెచ్చింది. మార్కెట్లో లభించే ఇతర ఉత్పత్తుల మాదిరిగానే, తాము కొనుగోలు చేసే పెట్రోల్ రకాన్ని ఎంచుకునే హక్కు వినియోగదారులకు ఉండాలని, పెట్రోల్ బంకుల్లో అన్ని రకాల ఇంధనాల మిశ్రమాలు, వాటి లాభనష్టాలకు సంబంధించిన పూర్తి వివరాలతో స్పష్టమైన లేబులింగ్ ప్రదర్శించాలని, ఎథనాల్ కలిపిన పెట్రోల్ విధానాలను, ఉచిత ఇంధన ఆఫర్లను నిలిపివేయాలని కోరుతోంది.

# విద్యార్థులపై నమోదైన కేసుల్ని ఎత్తివేయాలి

- అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలి
- అలా జరగకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు
- కేంద్రానికి కాక్రోచ్ జనతా పార్టీ వార్నింగ్

**వాస్తవదర్పణం, నేషనల్ డెస్క్:** ఆందోళనల సందర్భంగా కేంద్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఆరోపిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వానికి మరోసారి హెచ్చరించింది. విద్యార్థులపై నమోదైన కేసుల్ని వెంటనే ఎత్తివేయాలని, అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో మళ్లీ దేశవ్యాప్తంగా నిరసనలకు దిగుతామని హెచ్చరించింది. సోమవారం రోజు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పార్టీ ప్రతినిధి ఆశుతోష్ రాంకా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌లను ఉద్దేశించి పోస్ట్ చేశారు. నిరసనకారులపై ఎలాంటి పోలీసు చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని పాటించడం లేదని ఆరోపించారు. బిహార్, బెంగాల్‌లో వందల మంది విద్యార్థుల్ని అరెస్ట్ చేశారని, ఢిల్లీ సహా ఇతర రాష్ట్రాల్లో ఆందోళనకు మద్దతు ఇచ్చిన వాలంటీర్లను పోలీసులు వేధిస్తున్నారని రాంకా ట్వీట్ చేశారు. నిరసనకారులపై రిజిస్టర్ అయిన అన్ని ఎఫ్ఐఆర్‌లను వెంటనే రద్దు చేయాలని, ఇప్పటికే అదుపులోకి తీసుకున్న విద్యార్థుల్ని విడుదల చేయాలని అన్నారు. ఇంకా భవిష్యత్తులో కూడా కొత్త కేసులు నమోదు చేయబోమని లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



అనంతరం మీడియాతో మాట్లాడిన రాంకా జులై 25న మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో జరిగిన మూడో విడత చర్చల్లో కీలక ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. జంతర్ మంతర్ నిరసనలు, జులై 20న జరిగిన ఆందోళనతో పాటు దేశవ్యాప్తంగా జరిగిన నిరసనలకు సంబంధించి నిరసనకారులు, నిర్వాహకులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలన్న ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. భవిష్యత్తులో కూడా కొత్త కేసులు నమోదు చేయబోమని హామీ ఇచ్చిందన్నారు. ఈ ఒప్పందానికి సంబంధించిన డ్రాఫ్ట్ పేపర్లను తాము ఇప్పటికే జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌కు అందజేశామని, మంగళవారం నాటికి ప్రభుత్వం కూడా లిఖితపూర్వక ఒప్పందం ప్రతిని అందిస్తామని చెప్పిందని ఆశుతోష్ రాంకా అన్నారు. ఇరు పక్షాల న్యాయవాదులు పరిశీలించిన తర్వాత తుది ఒప్పందం ఖరారవుతుందని చెప్పారు. మంగళవారం లోపు ప్రభుత్వం లిఖితపూర్వక ఒప్పందాన్ని అందించకపోతే, వివిధ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్న విద్యార్థులు, యువతను విడుదల చేయకుంటే కాక్రోచ్ జనతా పార్టీ మళ్లీ దేశవ్యాప్తంగా ఆందోళనలు ప్రారంభించాల్సి వస్తుందని హెచ్చరించారు.



# రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వండి

- అయోధ్య రామాలయం కేసులో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

**వాస్తవదర్పణం, నేషనల్ డెస్క్:** అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ ఆరోపణలపై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ఘటనపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది. ఐజీ ఎస్.కిరణ్ నేతృత్వంలో నలుగురు సభ్యుల బృందం విరాళాల దుర్వినియోగంపై దర్యాప్తు చేస్తోందని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సిట్‌లో ఐదో సభ్యుడిగా ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా చేర్చాలని ఆదేశించారు. విరాళాల నిధుల మళ్లింపు, రికార్డుల తనిఖీకి ఫోరెన్సిక్ నిపుణుడి అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తును వేగవంతం చేయాలని సిట్‌ను ఆదేశించిన ధర్మాసనం, రెండు వారాల్లో దర్యాప్తు పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అయితే విరాళాల వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టాలన్న పిటిషనర్ విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. సిట్ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.



# లోక్‌సభలో యాంటీ-పేపర్ లీక్ బిల్లు

- విద్యార్థులపై లాఠీఛార్జ్‌పై అమిత్ షా క్షమాపణలు చెప్పాలి
- విపక్షాల నినాదాల మధ్య బిల్లు సభ ముందుకు
- అత్యంత కీలకమైన బిల్లుపై చర్చకు సహకరించండి: స్పీకర్ ఓంబిర్లా
- మంగళవారం చర్చ చేపట్టేందుకు అన్నిపక్షాల అంగీకారం

**వాస్తవదర్పణం, నేషనల్ డెస్క్:** పబ్లిక్ పరీక్షల్లో అక్రమాల నిరోధానికి రూపొందించిన చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై జరిగిన ఆందోళనల్లో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసినందుకు హోంమంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలంటూ విపక్షాలు నినాదాల మధ్య బిల్లును సభ ముందుకు తీసుకొచ్చింది. అయితే విపక్షాల నిరసనలతో ఎలాంటి చర్చ జరగనుండానే ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధికార, విపక్ష సభ్యులతో చర్చించి సయోధ్య కుదిర్చారు. దీనితో మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలను లీక్ చేసే వారిని కఠినంగా శిక్షించడమే లక్ష్యంగా కేంద్రం పరీక్షల్లో అక్రమాల నిరోధక చట్ట సవరణ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టింది. విపక్ష సభ్యుల ఆందోళన మధ్య కేంద్రమంత్రి జితేంద్రసింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. పేపర్ లీకేజీలు, పరీక్షల అక్రమాలపై ఉక్కుపాదం మోపేలా చట్టంలో కీలక సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు. అయితే విపక్షాలు నిరసన కొనసాగించడం వల్ల చర్చ సాధ్యపడలేదు. ఈ క్రమంలో సభ మొదట 12 గంటలకు తర్వాత 2గంటలకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తర్వాత కూడా విపక్షాలు ఆందోళన కొనసాగించగా స్పీకర్ అధికార, విపక్ష సభ్యులకు 3 గంటలు సమయం ఇచ్చారు. విభేదాలు పరిష్కరించుకోవాలని కోరుతూ సభను సాయంత్రం ఐదు గంటలకు వాయిదా వేశారు. అయితే తిరిగి సమావేశమైనా పరిస్థితిలో మార్పు లేకపోవడం వల్ల సభ మంగళవారానికి వాయిదా పడింది. అయితే లోక్‌సభలోని అన్నిపక్షాలతో సమావేశమైన స్పీకర్ ఓంబిర్లా అత్యంత కీలకమైన బిల్లుపై చర్చకు సహకరించాలని కోరారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంగళవారం చర్చ చేపట్టేందుకు అన్నిపక్షాలు అంగీకరించినట్లు పార్లమెంటు వర్గాలు తెలిపాయి.

# 'ఆ ప్రభుత్వ ఉద్యోగాలు చెల్లవు'

- విజయ్ సర్కార్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ
- ఈ నియామకాలు అధికరణ 14, 16కు విరుద్ధమని పేర్కొంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను కొట్టివేసిన కోర్టు

**వాస్తవదర్పణం, నేషనల్ డెస్క్:**

తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కరూర్ తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ విజయ్ సర్కార్ జారీ చేసిన ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ సోమవారం రద్దు చేసింది. జస్టిస్ సీవీ కార్తికేయన్, జస్టిస్ ఆర్.శక్తివేల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. కారుణ్య నియామకాల కోసం ప్రభుత్వ శాఖల్లో ఎంతో మంది అభ్యర్థులు వేచి చూస్తున్న తరుణంలో, వారి అవసరాలను పక్కనపెట్టి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదని కోర్టు స్పష్టం చేసింది. "ప్రభుత్వ ఉద్యోగాల కోసం పెద్ద ఎత్తున వెయిటింగ్ లిస్టు ఉంది. వారి హక్కులను కాలరాస్తూ కరూర్ తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు మాత్రమే ఇలాంటి ప్రత్యేక ఉపశమనం అందించడం తగదు. ఈ నియామకాలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 16 ప్రకారం, దేశ పౌరులకు కల్పించిన సమానత్వపు హామీని ఉల్లంఘిస్తున్నాయి. ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారాలు ఎప్పుడైనా రాజ్యాంగ పరిమితులకు లోబడే ఉండాలి" అని మద్రాస్ హైకోర్టు



తేల్చిచెప్పింది. మరోవైపు, మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించాలని టీవీకే ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**కారుణ్య నియామకాలు ఎలా చేస్తారు?**

ఈ కేసు విచారణ సందర్భంగా, మద్రాస్ హైకోర్టు బాణసంచా తయారీ కేంద్రాల్లో జరిగే ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలను ప్రస్తావించింది. "సాధారణంగా అలాంటి ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం (ఎక్స్‌గ్రేషియా) మాత్రమే అందిస్తుంది. అంతేగానీ కారుణ్య నియామకాల కింద ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వదు" అని కోర్టు గుర్తు చేసింది. అయితే ఈ నియామకాలు ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్ కోర్టులో వాదించారు. అయితే కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వడానికి ఇప్పటికే ఒక నిర్దిష్ట ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) అమలులో ఉందని, దానిని కచ్చితంగా పాటించాల్సిందేనని పిటిషనర్లు వాదించారు. తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తే, భవిష్యత్తులో ఇతరులు కూడా ఇలాంటి డిమాండ్లతో కోర్టులను ఆశ్రయించే అవకాశం ఉంటుందని, ఇది కొత్త వివాదాలకు దారితీస్తుందని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది.

**ఇది యువత సాధించిన విజయం!**

మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అడ్వకేట్ క్లీటస్ హర్షం వ్యక్తం చేశారు. "ఇది తమిళనాడు యువత సాధించిన భారీ విజయం. ఇదొక మైలురాయి లాంటి తీర్పు. ఎందుకంటే కారుణ్య నియామకాలు, పరిహార ఉత్తర్వులపై సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. తమిళనాడులో కూడా దీనికి సంబంధించిన ఒక నిర్దిష్ట జీవో అమలులో ఉంది. వాటి ఆధారంగానే మేము మా వాదనలను వినిపించాం. దీనిని పరిశీలించిన హైకోర్టు మధురై బెంచ్, కరూర్ ఘటన బాధితుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చే జీవోను రద్దు చేసింది" అని అన్నారు.

**ఇంతకీ ఏం జరిగింది?**

2025 సెప్టెంబర్ 27న కరూర్‌లో టీవీకే పార్టీ ఆధ్వర్యంలో ఒక భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో పార్టీ అధినేత విజయ్ ప్రసంగిస్తున్న సమయంలో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 41 మంది మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డారు. దీనితో మరణించిన వారి కుటుంబ సభ్యులకు సర్కార్ కొలువులు ఇవ్వాలని నిర్ణయించింది. అయితే ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మద్రాస్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఇదిలా ఉండగా, ఈ ప్రమాదంలో మరణించిన వారి బంధువులైన 31 మందికి తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఇటీవల 2026 జులై 10న స్వయంగా ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.

# 'కేంద్రం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవట్లేదు'

- కేసులు ఉపసంహరించుకోవాలని CJP అల్టిమేటం
- కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధి సౌరవ్‌దాస్ కీలక ప్రకటన
- మంగళవారంలోగా దేశవ్యాప్తంగా అన్ని కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్

**వాస్తవదర్పణం, నేషనల్ డెస్క్:**

నీట్ వ్యవహారంలో ఆందోళనలు చేసిన విద్యార్థులపై నమోదు చేసిన కేసులన్నింటినీ మంగళవారంలోగా ఉపసంహరించుకోవాలని కాక్రోచ్ జనతా పార్టీ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. ఈ విషయంలో లిఖితపూరిత హామీని మంగళవారంలోగా అందించకపోతే తర్వాతి కార్యాచరణను ప్రకటిస్తామని సీజేపీ హెచ్చరించింది. ప్రభుత్వం హామీ ఇవ్వడం వల్లే నిరసనను విరమించామని, ఇప్పుడు విశ్వాస ఘాతుకానికి పాల్పడవద్దని సీజేపీ ప్రతినిధి సౌరవ్‌దాస్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ముఖ్యంగా అసోం, బంగాల్, బిహార్‌లోని విద్యార్థులపై చర్యలు తీసుకుంటున్నట్లు తమకు సమాచారం అందుతోందని, నిరసనల కంటే చర్చలకే ప్రాధాన్యం ఇచ్చే యువత విశ్వాసాన్ని ఇది దెబ్బతీస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్బంధంలో



ఉన్న ఆందోళనకారులను విడిపించేందుకు ఇప్పటికే న్యాయవాదులతో తమ బృందం సమన్వయం చేసుకుంటోందని వివరించారు. పరిస్థితులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వంతోపాటు అన్ని ఎన్డీఏ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు సద్భావనతో వ్యవహరిస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ అంశంపై లిఖితపూర్వక హామీ ఇస్తామని కేంద్రం అంగీకరించిందన్న CJP, ఆ హామీని నెరవేర్చాలని కోరింది. "ప్రభుత్వం తన మాటకు కట్టుబడి ఉంటుందన్న హామీ ఆధారంగానే దేశవ్యాప్త నిరసనను నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఆ హామీ నుంచి ఏమాత్రం పక్కకు తప్పుకున్నా అది 'కాక్రోచ్ జనతా పార్టీ' పట్ల నమ్మకద్రోహం చేసినట్లు అవుతుంది. నిరసనలకు బదులుగా చర్చలను ఎంచుకున్న లక్షలాది మంది యువ భారతీయుల ప్రజావిశ్వాసాన్ని కూడా ఉల్లంఘించినట్లే అవుతుంది. కేంద్రం హామీని ఏమాత్రం ఉల్లంఘించినా అది యువతకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. యువ నిరసనకారులతో మేము చెప్పేది ఒక్కటే ధైర్యంగా ఉండండి. మేము మీకు అండగా ఉన్నాం. CJP పరిస్థితిని నిశితంగా గమనిస్తూనే ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కేంద్రం సహా అన్ని బీజేపీ, ఎన్డీఏ రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాయని ఆశిస్తున్నాం. నిర్బంధించిన లేదా అరెస్టు చేసిన వారందరినీ వెంటనే మంగళవారం లోపు విడుదల చేయాలి. ఇంకా అన్ని ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నాము. లేనిపక్షంలో మేము తదుపరి అవసరమైన చర్యలు తీసుకుంటాం." అని సీజేపీ హెచ్చరించింది. మరోవైపు జంతర్ మంతర్ వద్ద జులై 20న జరిగిన నిరసనల్లో విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జీ చేయడాన్ని సుప్రీం కోర్టు తప్పుబట్టింది. రాజ్యాంగం ప్రకారం శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ప్రజలకు ఉంటుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఆందోళనలను కారణంగా చూసి వారిపై మితిమీరిన బలప్రయోగం చేయడం సరైన చర్య కాదని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుత నిరసనలు, పోలీసుల చర్యలపై ఏకరూప మార్గదర్శకాలు అవసరమని సీజేఐ పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనల వేళ పోలీసుల తీరును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు.

# పసిడితో మెరిసిన హైదరాబాదీ!



ప్రతిష్ఠాత్మక ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారత యువ షూటర్ ఇషా సింగ్ సంచలనం సృష్టించింది. హంగ్జూ వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీలో ఒలింపిక్ విజేత మనూ భాకర్‌ను ఓడించి పసిడి పతకం కొల్లగొట్టిందీ హైదరాబాదీ. సోమవారం మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో మనూ కంటే మెరుగైన ప్రదర్శన కనబరిచిన 21 ఏళ్ల ఇషా.. పోడియం మీద సగర్వంగా స్వర్ణ పతకం స్వీకరించింది. మెగా ఈవెంట్లో నిరాశపరిచిన మనూ భాకర్ కాంస్యంతో సరిపెట్టుకుంది. షూటింగ్‌లో గొప్పగా రాణిస్తున్న ఇషా సింగ్ అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా చాటింది. ఇటీవలే మ్యూనిచ్‌లో అదిరే ప్రదర్శనతో రికార్డు పుస్తకాల్లో చేరిన ఇషా ఈసారి చైనాలోని హంగ్జూ వేదికగా జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో పసిడి వెలుగులు విరజిమ్మింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో భారత్‌కే చెందిన ఒలింపిక్ విజేత మనూ భాకర్‌ను ఓడించి పసిడి పతకం గెలచుకుంది ఇషా. మ్యూనిచ్‌లో పతకం గెలిచినందున ఈ మ్యాచ్‌లో నాపై ఒత్తిడి ఎక్కువ ఉంది. ఇలాంటి సమయంలో మనలోని అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాల్సి వస్తుంది. ఇక్కడే రెండేళ్ల క్రితం ఆసియా క్రీడల్లో పాల్గొన్న అనుభవం.. నాలుగు మెడల్స్ సాధించిన జ్ఞాపకాలు నాకు మరింత బలమయ్యాయి' అని ఇషా పేర్కొంది. త్వరలో జరగనున్న వరల్డ్ ఛాంపియన్‌షిప్స్, ఆసియా క్రీడలకు ముందు గోల్డ్ మెడల్ సాధించడం ఇషా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేయనుంది.





# బాక్సింగ్.. క్వార్టర్ ఫైనల్లో అంకుశ్, సచిన్!

కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్లు చెలరేగుతున్నారు. సూపర్ పంచ్‌లతో ప్రత్యర్థులను ఓడిస్తున్న అంకుశ్, సచిన్ సివాచ్ లు పతక వేటలో దూసుకెళ్తున్నారు. పురుషుల 80 కిలోల విభాగంలో అంకుశ్ క్వార్టర్ ఫైనల్ చేరగా.. 60 కిలోల ఇంగ్లండ్ బాక్సర్‌ను చిత్తు చేసిన సచిన్ సైతం క్వార్టర్స్ బెర్తు సాధించాడు. దాంతో, వీరిద్దరూ మరో బౌట్ గెలిచారంటే కనీసం కాంస్యం సొంతమవుతుంది.అయితే.. వీరు మాత్రం పసిడి పతకమే తమ లక్ష్యమంటున్నారు. గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్లు అద్భుతంగా రాణిస్తున్నారు. 60 కిలోల విభాగంలో సచిన్ సివాచ్, 80 కిలోల విభాగంలో అంకుశ్‌లు క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టారు. సోమవారం జరిగిన 16వ రౌండ్ ఇంగ్లండ్ బాక్సర్ విలియం హెవిట్‌ను సచిన్ చిత్తు చేశాడు. ప్రత్యర్థిపై పంచ్‌లతో విరుచుకుపడిన సచిన్ స్వర్ణం గెలవడమే తన లక్ష్యం అంటున్నాడు. 'కోచ్ మాటలు విన్న తర్వాత నేను పుంజుకున్నాను. నా లక్ష్యం పతకం గెలవడమే. అది కూడా గోల్డ్ మెడల్. టోర్నీ ఆరంభం నుంచి నేను పసిడి కోసమే పోరాడుతున్నా. తొలి రెండు మ్యాచ్‌లు కష్టంగా గట్టెక్కాను. తదుపరి బౌట్‌లకు నేను పక్కాగా సిద్ధమవుతా' అని సచిన్ మీడియాతో వెల్లడించాడు. మరో పదహారో రౌండ్ మ్యాచ్‌లో హర్యానాకు చెందిన అంకుశ్ ధాటికి జలాన్ జాన్(అంటిగ్వా) చేతులెత్తేశాడు. 80 కిలోల విభాగంలో పోటీ పడిన అంకుశ్ ఆరంభం నుంచి జలాన్‌పై పంచ్‌ల వర్షం కురిపించాడు. దాంతో, భారత బాక్సర్ 50తో గెలుపొందాడు. ఏకపక్ష పోరులో సూపర్ విక్టరీ కొట్టిన ఈ పొడగరి బాక్సర్ అలవోకగా క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. సెమీస్ చేరితో చాలు అంకుశ్ దేశానికి కనీసం కాంస్యం అందించే అవకాశముంది.






## కామన్వెల్త్ 'వెండి' విజేతకు 30 లక్షల రివార్డు

### ప్రకటించిన తమిళనాడు సీఎం విజయ్

కామన్వెల్త్ క్రీడల్లో వెయిట్‌లిఫ్టర్ రాజా ముత్తుపాండీ రజత పతకంతో మెరిసిన విషయం తెలిసిందే. రిషికాంత సింగ్ సిల్వర్, మీరాబాయి చాను గోల్డ్ మెడల్ గెలుపొందిన చోట.. నేను సైతం అంటూ ముత్తుపాండీ 65 కిలోల విభాగంలో వెండిని పట్టేశాడు. తద్వారా భారత్ ఖాతాలో నాలుగో పతకం చేరింది. అంతర్జాతీయ వేదికపై యావత్ దేశం గర్వపడేలా చేసిన ముత్తుపాండీకి తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ భారీ నజరానా ప్రకటించారు. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత వెయిట్‌లిఫ్టర్ రాజా ముత్తుపాండీ సిల్వర్ మెడల్ సాధించాడు. 68 కిలోల విభాగంలో సత్తా చాటిన అతడు.. రెండో స్థానంలో నిలిచి రజతం సొంతం చేసుకున్నాడు. తమిళనాడుకు చెందిన ముత్తుపాండీ విజయం పట్ల సీఎం జోసెఫ్ విజయ్ సంతోషం వ్యక్తం చేశారు. కామన్వెల్త్‌లో రజతంతో తమిళనాడు గర్వపడేలా చేసిన అతడికి భారీ నజరానా ప్రకటించారు ముఖ్యమంత్రి. 'అంతర్జాతీయ వేదికపై అబ్బురపరిచే ప్రదర్శన చేసినందుకు ముత్తుపాండీకి రూ.30 లక్షల రివార్డు ఇస్తామని విజయ్ తెలిపారు. గ్లాస్గోలో అతడి విజయం తమిళనాడు రాష్ట్రానికి ఎంతో గర్వకారణం. ముత్తుపాండీ సిల్వర్ మెడల్ సాధించడం ఎంతోమంది యువతకు స్ఫూర్తిగా నిలవనుంది.

లైఫ్ స్టైల్ LYFE STYLE



# ఫ్యాటీ లివర్ తగ్గించడంలో మేలు చేసే జీలకర్ర

కొవ్వు కాలేయం (ఫ్యాటీ లివర్) సమస్య భారత్‌లో వేగంగా పెరుగుతోంది. భారతీయ వైద్య పరిశోధనా మండలి (ICMR) అంచనాల ప్రకారం దేశంలో సుమారు 16 నుంచి 32 శాతం మంది ఫ్యాటీ లివర్ వ్యాధితో బాధపడుతున్నారు. అంటే దాదాపు 12 కోట్ల మందిపై ఈ సమస్య ప్రభావం చూపుతోంది. జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులే దీనికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో ఆరోగ్యకరమైన ఆహారం, సహజ పద్ధతులపై ఆసక్తి పెరుగుతోంది. వాటిలో జీలకర్ర నీరు (జీరా వాటర్) కూడా ఒకటి. కొన్ని అధ్యయనాలు జీలకర్రలోని బయోయాక్టివ్ సమ్మేళనాలు కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో తోడ్పడతాయని సూచిస్తున్నాయి. అయితే ఇది చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలి. అధ్యయనాల ప్రకారం, జీలకర్రలోని కొన్ని సహజ సమ్మేళనాలు కాలేయ ఎంజైమ్‌ల పనితీరును మెరుగుపరచడం, కొవ్వు జీవక్రియను సమతుల్యం చేయడం, ఫ్యాటీ లివర్ ప్రారంభ దశలో కొంత ప్రయోజనం కలిగించడంలో సహాయపడతాయి. అయితే ఇవి వైద్య చికిత్సతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించినప్పుడే మెరుగైన ఫలితాలు ఇస్తాయి.

## షుగర్ లెవల్స్ తగ్గేందుకు..

జీలకర్ర నీరు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జీలకర్రలోని పదార్థాలు జీర్ణ ఎంజైమ్‌ల పనితీరును ప్రోత్సహించడం ద్వారా కొవ్వులు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. దీంతో కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. కొన్ని పరిశోధనలు జీలకర్ర నీరు రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో, శరీరంలో కొవ్వు నిల్వలను తగ్గించడంలో సహాయపడుతుందని సూచిస్తున్నాయి. అలాగే ఫాస్టింగ్ షుగర్ స్థాయిలను నియంత్రించడం, బరువు తగ్గడంలో కూడా కొంత మేర ఉపయోగపడుతుందని పరిశోధకులు చెబుతున్నారు. జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గించి కణాల రక్షణకు తోడ్పడతాయి. అలాగే మెటబాలిక్ సిండ్రోమ్‌కు సంబంధించిన కొన్ని సూచికలను మెరుగుపరచడంలో కూడా పాత్ర పోషిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. జీలకర్ర నీరు కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో కూడా సహాయపడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. రోజుకు సుమారు 3 గ్రాముల జీలకర్రను మూడు నెలల పాటు తీసుకున్న వారిలో శరీర కొవ్వు, నడుము చుట్టుకొలత, కొలెస్ట్రాల్ స్థాయిల్లో మెరుగుదల కనిపించినట్లు కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి.

## ఉదయం తాగితే..

ఉదయం ఖాళీ కడుపుతో జీలకర్ర నీరు తాగితే అందులోని ప్రయోజనకర సమ్మేళనాలు శరీరానికి బాగా అందుతాయి. దీంతో పోషకాలు సులభంగా లభించడంతోపాటు జీవక్రియ వేగంగా ప్రారంభమవుతుంది. అలాగే పేగులు, కాలేయం మధ్య సమన్వయం మెరుగుపడటానికి కూడా ఇది తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. జీలకర్ర నీటిని తయారు చేయడం చాలా సులభం. ఒక టీస్పూన్ జీలకర్రను రాత్రంతా నీటిలో నానబెట్టాలి లేదా నీటిలో మరిగించి ఉదయం గోరువెచ్చగా తాగాలి. ఇందులో చక్కెర కలపకుండా తీసుకోవడం మంచిది. చక్కెర కలిపితే రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉండటంతో ఆశించిన ప్రయోజనాలు తగ్గిపోతాయి.

## ఈ సమస్యలు ఉంటే..

అయితే జీలకర్ర నీటిని అధికంగా తీసుకోవడం మంచిది కాదు. మోతాదుకు మించి తీసుకుంటే జీర్ణ సంబంధిత అసౌకర్యాలు తలెత్తే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గర్భిణులు, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (IBS) ఉన్నవారు వైద్యుల సలహాతో మాత్రమే తీసుకోవాలి. అలాగే ఫ్యాటీ లివర్ తీవ్ర దశల్లో ఉన్నవారికి ఇది చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. ఫ్యాటీ లివర్ ప్రమాదాన్ని తగ్గించాలంటే సమతుల్య ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం, మద్యం పరిమితం చేయడం వంటి జీవనశైలి మార్పులు తప్పనిసరి. అలాగే శుద్ధి చేసిన చక్కెర, మైదా వంటి రిఫైన్డ్ కార్బోహైడ్రేట్ల వినియోగాన్ని తగ్గించడం కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. జీలకర్ర నీరు ఆరోగ్యకరమైన అలవాట్లలో ఒకటిగా ఉపయోగపడుతుంది. అయితే ఇది ఫ్యాటీ లివర్‌ను పూర్తిగా నయం చేసే మందు కాదు. ఇప్పటికే ఫ్యాటీ లివర్ ఉన్నవారు లేదా ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు దీనిని రోజువారీ అలవాటుగా మార్చే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.

వాస్తవ దర్పణం
తెలుగు దిన పత్రిక



# చూస్తున్నంతసేపూ నవ్వుతూనే ఉంటారు!



## 'కొరియన్ కనకరాజు' హీరోయిన్ రితిక నాయక్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు'తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్ కామెడీ సూపర్‌నేచురల్ ఎలిమెంట్స్, నవ్వులు పంచే వినోదంతో గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించనుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఎంటర్‌టైనింగ్ టీజర్, చార్ట్‌బస్టర్‌గా నిలిచిన రెండు పాటల సినిమాపై ప్రేక్షకుల్లో మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి. 'కొరియన్ కనకరాజు' ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ రితిక నాయక్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు మీకు బాగా నచ్చిన అంశం ఏమిటి?**

కొరియా వెళ్ళడం నన్ను మొదట ఆకట్టుకుంది. (నవ్వుతూ) ఎందుకంటే నాకు కొరియన్ కల్చర్, అక్కడి సినిమాలు, కొరియన్ డ్రామాలు అంటే చాలా ఇష్టం. ఇందులో నేను చేసిన పాత్రకు, నా వ్యక్తిత్వానికి కూడా కొన్ని పోలికలు ఉన్నాయి. ఇది కేవలం కమర్షియల్ పాత్ర మాత్రమే కాదు. చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ప్రేక్షకులు కూడా ఈ పాత్రకు బాగా కనెక్ట్ అవుతారని నమ్ముతున్నాను. ఇప్పటివరకు నేను ఇలాంటి పాత్ర చేయలేదు.

**కథల ఎంపిక విషయంలో మీరు చాలా సెలెక్టివ్‌గా ఉంటారా?**

అవును. నాకు చాలా ఓపిక ఉంది. మంచి స్క్రిప్ట్ కోసం ఎంతకాలమైనా ఎదురుచూడగలను. ఒక పాత్రకు నేను 100 శాతం న్యాయం చేయగలనని అనిపిస్తేనే అంగీకరిస్తాను. ప్రేక్షకులు మెచ్చే పాత్రలు చేయడంపైనే నా దృష్టి ఉంటుంది.

ఈ సినిమాలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?

ఈ సినిమాలో నేను సెల్ఫ్ ఇండిపెండెంట్, చాలా మోడరన్ అమ్మాయిగా కనిపిస్తాను. ఇప్పటివరకు నేను చేసిన పాత్రలన్నింటికంటే ఇది చాలా మోడరన్ క్యారెక్టర్.

**వరుణ్ తేజ్ తో పనిచేయడం ఎలా అనిపించింది?**

వరుణ్ తేజ్ గారు చాలా హార్డ్‌వర్కింగ్ పర్సన్. తన వృత్తి పట్ల ఎంతో డెడికేషన్ ఉంటుంది. ఇటీవల కొన్ని ప్యాచ్‌వర్క్ షూట్స్ చేశాం. ఆయనకు గాయం ఉన్నప్పటికీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 3 గంటల వరకు షూటింగ్ చేశారు. అది ఆయన డెడికేషన్‌కు నిదర్శనం. ఆయనతో కలిసి పనిచేయడం చాలా మంచి ఎక్స్‌పీరియన్స్.

**హారర్ కామెడీ జోనర్‌లో 'కొరియన్ కనకరాజు' ఎంత డిఫరెంట్‌గా ఉండబోతోంది?**

ఈ సినిమా కాన్సెప్ట్ చాలా కొత్తగా ఉంటుంది. హారర్ కామెడీలు చాలా వచ్చినప్పటికీ, ఇందులోని కథ, ఇండియన్‌కొరియన్ కల్చర్స్ అంశాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయి. ఇది చాలా మంచి కామెడీ ఎంటర్‌టైనర్. ఈ సినిమాలో సత్య గారి పాత్ర కూడా చాలా బాగుంటుంది. ఆయన కామెడీ ప్రేక్షకులను బాగా నవ్విస్తుంది. కామెడీ టైమింగ్ విషయంలో ఆయన నాకు చాలా హెల్ప్ చేశారు. అలాగే వీటీవీ గణేష్ గారు, బుల్లిరాజు గారు ఇలా చాలామంచి హాస్యనటులు ఇందులో ఉన్నారు. ప్రేక్షకులు థియేటర్‌లో కడుపుబ్బా నవ్వుకునే సినిమా అవుతుంది.

**ఇతర భాషల్లో కూడా సినిమాలు చేయాలనుకుంటున్నారా?**

మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్నాను. అవకాశం వస్తే తప్పకుండా అన్ని భాషల్లో పనిచేయాలని ఉంది. కానీ తెలుగుకే నా మొదటి ప్రాధాన్యత. ఎందుకంటే ఇది నా మదర్ ఇండస్ట్రీ. 'అశోకవనంలో అర్జున కళ్యాణం', మిరాయ్, 'హాయ్ నాన్న' నేను చేసిన ప్రతి సినిమాను ప్రేక్షకులు ఎంతో ఆదరించారు.

**భవిష్యత్తులో ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటున్నారు?**

మంచి కథ, పాత్రకు ప్రాధాన్యం ఉన్న అన్ని రకాల సినిమాలు చేయాలని ఉంది.

**'కొరియన్ కనకరాజు' సినిమా చూశారు కదా... ఎలా అనిపించింది?**


సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. చూస్తున్నంతసేపూ నేను నవ్వుతూనే ఉన్నాను. ప్రేక్షకులు కూడా అదే స్థాయిలో ఎంటర్‌టైన్ అవుతారని నమ్ముతున్నాను.

**'మిరాయ్ 2' గురించి చెప్పండి?**

ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. దాని గురించి చెప్పడానికి ఇంకా సమయం ఉంది.

**మీ అప్‌కమింగ్ ప్రాజెక్ట్స్ గురించి?**

ప్రస్తుతం ఒక తెలుగు ప్రాజెక్ట్ చేస్తున్నాను. అది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. దాని గురించి త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తారు.



# రిఫ్రెషింగ్ రొమాంటిక్ రైడ్

## 'శ్రీ శ్రీ' నుంచి సాంగ్ రిలీజ్

వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం నూతన దర్శకుడు రవి నెలకుదిటి దర్శకత్వంలో రూపొందుతున్న క్రేజీ ఎంటర్‌టైనర్ శ్రీ శ్రీ బిజీగా ఉన్నారు. ప్రతిష్టాత్మక ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్, నిర్మాణ సంస్థకు 10వ (#SLV10) మైల్ స్టోన్ చిత్రంగా నిలుస్తోంది. ఇషాన్ సక్సేనా ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే తొలిసారి జంటగా నటిస్తున్న ఈ సినిమా ప్రేమ, వినోదం, భావోద్వేగాలతో కూడిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన వర్కింగ్ స్టిల్స్, ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందన అందుకోగా, తాజాగా ఈ సినిమా మ్యూజికల్ జర్నీని ప్రారంభిస్తూ తొలి పాట 'బొమ్మ బొమ్మ'ను మేకర్స్ విడుదల చేశారు. రైల్వే స్టేషన్‌లో బెంచ్ పై కూర్చున్న దుల్కర్ సల్మాన్, ప్లాట్ ఫామ్‌పైకి పూజా హెగ్డే అడుగుపెట్టిన క్షణమే ఆమెకు మెస్మరైజ్ అవుతాడు . అక్కడి నుంచి ఇద్దరి అందమైన ప్రేమ ప్రయాణాన్ని, ఆనంద క్షణాలను, వారితో పాటు ఉండే ఓ బృందాన్ని ఈ పాటలో అందంగా చూపించారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ మరోసారి మనసును హత్తుకునే మధురమైన మెలోడీని అందించారు. ఆహ్లాదకరమైన ట్యూన్, అందమైన ఆర్కెస్ట్రేషన్‌తో ఈ పాట ఆకట్టుకుంటుంది. అనంత శ్రీరామ్ తన సాహిత్యంతో ప్రేమలో మునిగిపోయిన ఓ యువకుడి భావాలను కవితాత్మకంగా ఆవిష్కరిస్తూ, కథానాయిక అందం, ఆమె ప్రత్యేకతను ఎంతో అందంగా వర్ణించారు. కపిల్ కపిలన్ తన మెలోడీ వోకల్ తో పాటకు మరింత అందం తీసుకురాగా, రామ్ మాస్టర్ అందించిన కొరియోగ్రఫీ విజువల్‌గా పాటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది.

# చిట్టిబాబుగా వెంకటేశ్

విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక కుటుంబ కథా చిత్రం "ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 (AK47)" ప్రచార కార్యక్రమాలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చిత్రంలోని ప్రధాన పాత్రలను ఒక్కొక్కటిగా పరిచయం చేస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. తొలి పాత్రగా విక్టరీ వెంకటేష్ పోషిస్తున్న 'చిట్టిబాబు' పాత్రను పరిచయం చేయగా, అనంతరం శ్రీనిధి శెట్టి, యువినా పార్థవి, రాజా ప్రజ్వల్ పాత్రలను పరిచయం చేయనున్నారు. ఈ నలుగురి పాత్రలు ఈ ఆత్మీయ కుటుంబ కథకు హృదయంగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో వెంకటేష్ చిట్టిబాబు పాత్రలో అలరించనున్నారు. కుటుంబాన్ని ప్రేమతో, ఆప్యాయతతో, బాధ్యతతో ఒకే తాటిపై నడిపించే కుటుంబ పెద్దగా ఆయన పాత్ర ఆకట్టుకోనుంది. విడుదలైన పాత్ర పరిచయ వీడియోలో వెంకటేష్‌తో పాటు శ్రీనిధి శెట్టి, నారా రోహిత్ కనిపిస్తూ, నవ్వులు, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలతో నిండిన చిత్ర ప్రపంచాన్ని అందంగా పరిచయం చేశారు. సహజమైన నటన, అద్భుతమైన కామెడీ టైమింగ్, కుటుంబ కథా చిత్రాల్లో తనదైన ముద్ర వేసిన వెంకటేష్ మరోసారి అన్ని వయసుల ప్రేక్షకులను అలరించే పాత్రతో రాబోతున్నారు. చిట్టిబాబు పాత్ర ఆయన కెరీర్‌లో మరో చిరస్మరణీయమైన పాత్రగా నిలిచేలా కనిపిస్తోంది. ఆనందం, అనుబంధాలు, కుటుంబ విలువలకు ప్రతిరూపంగా ఈ పాత్ర ఉండబోతోంది. తొలి పాత్ర పరిచయంతోనే చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక వరుసగా రానున్న ఇతర పాత్రల పరిచయాలు కూడా 'ఆదర్శ కుటుంబం' ప్రపంచాన్ని మరింత ఆసక్తికరంగా ప్రేక్షకులకు చేరువ చేయనున్నాయి.



## 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47'





# ఫ్రెండ్‌షిప్, పవర్ & రివెంజ్

## కింగ్ జాకీ క్వీన్ ట్రైలర్ రిలీజ్

సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి SLV సినిమాస్ బ్యానర్ పై నిర్మించిన పీరియడ్ క్రైమ్ డ్రామా #KJQ (కింగ్ జాకీ క్వీన్). 1990ల నాటి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో 'దసరా', 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రాలతో గుర్తింపు పొందిన దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నారు. వీరితో పాటు నూతన నటుడు శశి ఓదెల, యుక్తి తరేజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గత ఏడాది కన్నుమూసిన దర్శకుడు KKకి ఇది చివరి చిత్రం. ఆయన క్రియేటివిటీ, సినిమా పట్ల ఆయనకున్న అంకితభావానికి ఇది ఒక నివాళిగా నిలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఈ సినిమాపై మంచి ఆసక్తిని రేకెత్తించాయి. తాజాగా చిత్ర బృందం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసింది, ఇది సినిమా నేపథ్యాన్ని, కథాంశాన్ని పరిచయం చేస్తోంది. దావూద్ ఇబ్రహీం, అజ్మల్ కసబ్, మదర్ థెరిసాలతో పోలుస్తూ ప్రధాన పాత్రలను పరిచయం చేసే ఆకట్టుకునే వాయిస్‌ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. పరిస్థితులు ఒక మనిషిని క్రూర మృగంగానో, గొప్ప మహర్షిగానో లేదా సాధారణ మనిషిగానో ఎలా మారుస్తాయో ఇది సూచిస్తుంది, దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా పోషించిన పాత్రలకు బలమైన పునాదిని వేస్తుంది. అధికారం, అహంకారం, ప్రతీకారం చుట్టూ తిరిగే ఉత్కంఠభరితమైన కథని ప్రజెంట్ చేస్తోంది. ఇందులో ఇద్దరు ప్రాణ స్నేహితుల మధ్య తలెత్తే తీవ్ర సంఘర్షణ కథను నడిపిస్తుంది. దీక్షిత్ శెట్టి అద్భుతమైన నటనతో కథను తన భుజాలపై మోశారు, ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, నటన కథనానికి ఎంతో బలాన్ని చేకూర్చాయి. నూతన నటుడు శశి ఓదెల తన నటనతో ఆకట్టుకుని మంచి ముద్ర వేశారు, అలాగే యుక్తి తరేజా కీలక పాత్రలో తనదైన శైలిలో కనిపించారు.

Printed and Published by Editor **MD. ZAKRIA**, on behalf of QSS PUBLICATION(Owner: Abdul Sattar), Printed at New Bharath Printers, Main Road, Ramanthapur, Hyderabad – 13. Published at: 3-7-1, Indira Nagar, Ramanthapur, Hyderabad – 500 013. Ph: 9701485857. RNI NO : APTEL/2013/54511.